వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ

PRAJA SWECHA

రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక



హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 164 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/-



## నాది బీజేపీ డీఎన్ఏ..

- ప్రశ్నిస్తే నీ డీఎన్ఏ ఏమిటని మాట్లాడుతున్నారు
- ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

హైదరాబాద్,
తెలంగాణలో ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. బెదిరింపులు, తిట్ల పురాణాలు తప్ప ఏమీ సాధించలేదని అన్నారు. సమస్యలపై

-మిగతా 3 లో



## చనిపోతే గానీ స్పందించరా...

- పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్‌పై హైకోర్టు ఆగ్రహం

హైదరాబాద్,
నారాయణపేట జిల్లా మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులు నిద్రపోతున్నారా? అంటూ తీవ్రంగా స్పందించింది. వారంలో మూడుసార్లు ఫుడ్ పాయిజనింగ్ జరిగితే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీసింది. స్కూల్‌లో ఫుడ్

-మిగతా 3 లో



## డిసెంబర్ నెలలో స్కూళ్లకు భారీగా సెలవులు

9 రోజులు హాలీడేస్ వచ్చే అవకాశం

హైదరాబాద్,
తెలుగు రాష్ట్రాల్లో దసరా నుంచి స్కూళ్లకు సెలవులు ఎక్కువగా వస్తుంటాయి. ఈ ఏడాది అక్టోబర్ నెలలో దసరా సెలవులు వచ్చాయి. దీపావళి కూడా అక్టోబర్ నెలలోనే వచ్చింది. దీంతో అక్టోబర్ లో స్కూళ్లకు ఎక్కువగానే సెలవులు వచ్చాయి. నవంబర్ లో పండుగలు లేకపోవడంతో పూర్తిగా బడికి వెళ్లిన స్టూడెంట్స్ కు మళ్లీ సెలవుల సీజన్ ప్రారంభం అయ్యింది. డిసెంబర్ నెలలో దాదాపుగా 9 రోజులు సెలవులు వస్తున్నాయి.

-మిగతా 3 లో

# నేటి నుంచి రైతుల పండుగ

- మూడు రోజులు విజయోత్సవాలు
- మహబూబ్‌నగర్‌లో నిర్వహణ
- అనుబంధశాఖలతో కలిసి భారీ ఏర్పాటు
- ఏడాదిలో రైతుల సంక్షేమానికి సర్కారు చేసిన ఖర్చు రూ.55 వేల కోట్లు

హైదరాబాద్
మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంగా ప్రజాప్రభుత్వం గురువారం నుంచి మూడు రోజుల పాటు రైతు పండుగను నిర్వహిస్తున్నది. అన్ని జిల్లాల రైతులు ఈ వేడుకల్లో పాలుపంచుకునేందుకు

-మిగతా 3 లో



## గ్రూపులొద్దు..కలిసి పనిచేయండి

రాష్ట్ర బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రధాని స్ట్రాంగ్ వార్నింగ్



న్యూఢిల్లీ
బీజేపీకి చెందిన రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలకు ప్రధాని మోడీ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పార్టీలో గ్రూప్ రాజకీయాలు, ఒకరిపై ఒకరు తెరవెనక కుట్రలకు

-మిగతా 3 లో



## ప్రజాపాలన అంటే నిర్బంధాలా..?

నిర్బంధాలతో ఉద్యమాలు ఆగుతాయా?

కాంగ్రెస్ పాలనను ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,
ప్రజాపాలన అంటూ చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలతో పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది

-మిగతా 3 లో

## నవంబర్ 30 నుంచి బీఆర్ఎస్ 'గురుకుల బాట



- దిలావర్‌పూర్‌లో రైతుల దెబ్బకు దిగొచ్చిన రేవంత్ రెడ్డి
- లగచర్లలోనూ తప్పు ఒప్పుకొని వెనక్కి తగ్గిపో
- వెనక్కి తగ్గినంత మాత్రాన రేవంత్ రెడ్డి కిరీటం పడిపోదు
- డిసెంబర్ 7 వరకు కొనసాగిస్తాం
- విద్యను రేవంత్ సర్కార్ సంక్షోభంలోకి నెట్టింది
- సీఎం ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోవడం లేదు
- ఆర్ఎస్ ప్రవీణ్ నేతృత్వంలో అధ్యయన కమిటీ వేస్తున్నాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్,
తప్పు ఒప్పుకొని వెనక్కి తగ్గినంత మాత్రాన రేవంత్ రెడ్డి కిరీటం ఏమీ పడిపోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దిలావర్‌పూర్‌లో రైతుల దెబ్బకు దిగొచ్చిన రేవంత్ రెడ్డి లగచర్లలోనూ లెంపలేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.వెంటనే

-మిగతా 3 లో



## క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- ఎల్బీ స్టేడియంలో వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి
- ఆ వేడుకలకు అన్ని చర్చిల అధిపతులను ఆహ్వానించండి
- 95 అసెంబ్లీ నియోజకవర్గాలు, జీహెచ్ఎంసి పరిధిలో 200 ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహణ
- క్రిస్మస్ సెలబ్రేషన్ కమిటీ సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్
ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలను రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. క్రిస్మస్ వేడుకల నిర్వహణపై బుధవారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సెలెబ్రేషన్ కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులతో సమీక్షించారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండు వందల ప్రాంతాలు, 95 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాష్ట్ర ప్రభుత్వం తరపున నిర్వహించే క్రిస్మస్ వేడుకలకు

-మిగతా 3 లో

## మత మార్పిడికి పాల్పడడం రాజ్యాంగాన్ని మోసం చేయడమే



- రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు మత మార్పిడి
- మతంపై విశ్వాసం లేకుండా మత మార్పిడి
- మత మార్పిళ్లకు కుల ధ్రువీకరణ పత్రాలు అనుమతించం
- మత మార్పిళ్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ,
మత మార్పిళ్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతంపై విశ్వాసం లేకుండా కేవలం రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు మత మార్పిడికి పాల్పడడం రాజ్యాంగాన్ని మోసం చేయడమే అవుతుందని

-మిగతా 3 లో

# రూపాయి డీలా

**– డాలర్‌తో రూపాయి మారకం విలువ 15 పైసలు పతనమై రూ. 84.44కి**



**ముంబయి**

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ మరింత పడిపోయింది. బుధవారం అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 15 పైసలు పతనమై 84.44 స్థాయికి దిగజారింది. అమెరికాకు ట్రంప్ అధ్యక్షునిగి ఎన్నికైన తర్వాత డాలర్ బలపడటానికి తోడు దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు వరుసగా ఈక్విటీలను తరలించుకుపోవడంతో రూపాయిపై ఒత్తిడి పెరిగింది. మరోవైపు చమురు ధరలు పెరగడమూ, యూఎస్ ఫెడ్ మీటింగ్ అంశాలు ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. భారత స్టాక్ మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు తరలిపోవడంతో ప్రతికూల ప్రభావం పడుతోంది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 84.38 వద్ద ప్రారంభమైంది. ఇంట్రాడేలో 84.48 కనిష్ట స్థాయిని తాకింది. వరుసగా రూపాయి విలువ పడిపోవడంతో దిగుమతులు భారం కావడంతో పాటు విదేశీ అప్పులపై అధికంగా చెల్లింపులు చేయాల్సి వస్తుంది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ఒత్తిడిని పెంచనుంది.

# ప్రధాని మోదీతో డిప్యూటీ సీఎం పవన్ భేటీ


**జలజీవన్ మిషన్ నిధులపై చర్చ**



అమరావతి

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. నిన్న పలువురు కేంద్ర మంత్రులను కలవగా.. ఇవాళ ప్రధానమంత్రి మోదీతో భేటీ అయ్యారు.పార్లమెంట్ భవనంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో మోదీతో పవన్ సమావేశమయ్యారు. జలజీవన్ మిషన్ అమలు, ఏపీకి నిధులపై చర్చించారు. ఇటీవలే వచ్చిన ఎన్నికల ఫలితాలతో పాటు ఏపీ రాజకీయాలపై వీరద్దరి భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. మరోవైపు ఏపీకి కేంద్రం చేస్తున్న సాయానికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు.డిప్యూటీ సీఎం హోదాలో పవన్ ఢిల్లీకి వెళ్లడం ఇది రెండోసారి. కొన్ని రోజుల క్రితం ఆయన ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. తొలిసారి ఢిల్లీలో ప్రధానితో పవన్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ప్రస్తుత పర్యటనలో వరుసగా పలువురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో కూడా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగల్ విండో విధానానికి మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఏపీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఢిల్లీ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ ను పలువురు ఎంపీలు కలిశారు. ఏపీ నుంచి బీజేపీ ఎంపీగా ఉన్న పురందేశ్వరితో కాసేపు మాట్లాడారు.పలు రాష్ట్రాల ఎంపీలతో కూడా పవన్ కల్యాణ్ కాసేపు ముచ్చటించారు.

# కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించిన బైడెన్



**న్యూఢిల్లీ,**

ఇజ్రాయెల్–హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విషయంలో కీలకమైన పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణపై అంగీకారం కుదుర్చుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్‌లో ప్రకటించారు. 'ఇదొక శుభవార్త. నేను ఇజ్రాయెల్, లెబనాన్ నాయకులతో మాట్లాడాను. టెల్అవీవ్–హెజ్‌బొల్లాల మధ్య ఉత్కంఠభరిత పరిస్థితులకు ముగింపు చేకూర్చేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలను వారు సమర్థించారు. ఇది ఒక మంచి అడుగు" అని బైడెన్ తెలిపారు.ఇక ఈ పరిణామంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా స్పందిస్తూ, ఈ ఒప్పందం ఎంతకాలం అమలులో ఉంటుందనేది లెబనాన్ వైఖరిపై ఆధారపడి ఉంటుందని అన్నారు. "మేము ఒప్పందానికి కట్టుబడి ఉంటాం. కానీ ఉల్లంఘనల జరిగితే తగిన ప్రతిస్పందన ఇస్తాం. విజయం సాధించే వరకు మేము ఏకంగా పోరాటం కొనసాగిస్తాం" అని నెతన్యాహు స్పష్టం చేశారు.

# సాధారణ ఎలక్షన్ ను తలపించిన భాగ్యరధి ఎలక్షన్స్...





**కుత్బుల్లాపూర్ నవంబర్ 27,ప్రభ:**

చింతల్ లోని భాగ్యరధి జూనియర్ కళాశాల లో విద్యార్థులకు ఎలక్షన్ విధానం తెలియజేయుటకు మరియు మాక్ అసెంబ్లీ పెట్టి అందులో సీఎం రోల్, ప్రతిపక్ష పార్టీ లీడర్, స్పీకర్ రోల్ చేయుటకు ప్రత్యక్షంగా ఎలక్షన్ నిర్వహించడం జరిగింది.. అందుకుగాను ఆరుగురు సీనియర్ విద్యార్థులు అర్జున్ మౌర్య డి.ప్రేమ్ కుమార్, ఎం.సాయి చరణ్ ,మహమ్మద్ అఫ్రోజ్ మహమ్మద్ తాజుద్దీన్ , మహమ్మద్ బిలాల్ ఎలక్షన్ లో పోటీ చేయడం జరిగింది. 22-11-24 నుండి25-11-24 వరకు నామినేషన్ సమర్పించారు.26-11-24 సింబల్స్ కేటాయించడం మరియు ప్రచారం చేసుకోవడం జరిగింది. 27-11-24 నా బ్యాలెట్ పేపర్ మరియు సీక్రెట్ బ్యాలెట్ బాక్స్ ద్వారా ఓటింగు సీనియర్



బాయ్స్ వినియోగించుకోగా 245 మంది విద్యార్థులలో 175 మంది ఓటింగ్ లో పాల్గొనడం జరిగింది. ఉదయం10 గంటల నుండి 12 గంటల వరకు ఒక క్రమ పద్ధతిలో ఓటు హక్కు వినియోగించుకోవడం జరిగింది. 12 గంటల తర్వాత బ్యాలెట్ బాక్స్ తెరిచి కౌంటింగ్ ప్రారంభించగా మహమ్మద్ తాజుద్దీన్ కు 81 ఓట్లతో ప్రథమ స్థానంలో సీఎం అభ్యర్థిగా ఎంపిక కావడం జరిగింది. డి .ప్రేమ్ కుమార్ 36 ఓట్లతో ద్వితీయ స్థానంలో ప్రతిపక్ష లీడర్ గా మహమ్మద్ బిలాల్ 26 ఓట్లతో స్పీకర్ ఎంపిక కావడం జరిగింది. ఓటింగ్ లో పాల్గొన్న విద్యార్థులు అందరూ చాలా ఆనందాన్ని వ్యక్తం పరచడం జరిగింది. మాక్ అసెంబ్లీ జరపడానికి తగిన చర్యలు తీసుకోవాలని యాజమాన్యానికి విద్యార్థులు కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎన్.వెంకట్ రెడ్డి ,సిహెచ్.గోవిందరెడ్డి జి.రమేష్ బాబు, కె.రామకృష్ణ, నల్ల జై శంకర్ గౌడ్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# కాల్పుల విరమణ

**– ఇజ్రాయిల్, హిజ్బుల్లా ఒప్పందం**
**– 14 నెలల పోరుకు స్వస్తి**

**జెరూసలేం**

గత 14 నెలలుగా లెబనాన్‌లో సాగుతున్న మారణహోమానికి ఇజ్రాయిల్, హిజ్బుల్లా స్వస్తి చెప్పాయి. ఇరు పక్షాలు బుధవారం కాల్పుల విరమణను ప్రారంభించాయి. ఒప్పందాన్ని హిజ్బుల్లా ఉల్లంఘిస్తే తిరిగి దాడి జరుపుతానని ఇజ్రాయిల్ ప్రకటించింది. దక్షిణ లెబనాన్ ప్రజలెవ్వరూ త్వరపడి స్వస్థలాలకు చేరుకోవద్దని, సైన్యం ఇప్పటికీ అక్కడ మోహరించి ఉన్నదని ఇజ్రాయిల్ సైనిక ప్రతినిధి ఒకరు తెలిపారు. ఒప్పందం ప్రకారం తొలుత రెండు నెలల పాటు ఇరు పక్షాలు కాల్పుల విరమణ పాటిస్తాయి. దక్షిణ లెబనాన్ నుండి హిజ్బులా మిలిటెంట్లు వైదొలుగుతారు. అలాగే ఇజ్రాయిల్ దళాలు కూడా తమ సరిహద్దుకు చేరుకుంటాయి. వేలాది అదనపు లెబనాన్ దళాలు, ఐరాస శాంతి పరిరక్షక దళాలు దక్షిణ ప్రాంతంలో మోహరిస్తాయి. అమెరికా నేతృత్వంలోని అంతర్జాతీయ బృందం ఒప్పందం అమలును పర్యవేక్షిస్తుంది. కాల్పుల విరమణ బుధవారం ఉదయం నాలుగు గంటలకు ప్రారంభమైంది. ఇజ్రాయిల్ దళాలు మంగళవారం బీరూట్‌లో పెద్ద ఎత్తున వైమానిక దాడులు జరిపాయి. ఘర్షణ ప్రారంభమైన తర్వాత భారీ స్థాయిలో దాడులు జరగడం ఇదే మొదటిసారి. ఈ నేపథ్యంలో ఇరు పక్షాల మధ్య యుద్ధం తీవ్రమవుతుందన్న సంకేతాలు వెలువడ్డాయి. వైమానిక దాడుల్లో 42 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే కాల్పుల



విరమణ ప్రకటన వెలువడింది. కాగా గాజాలో జరుగుతున్న భీకర పోరు ప్రస్తావన మాత్రం కాల్పుల విరమణ ఒప్పందంలో లేదు. ఇప్పటికీ హమాస్ చేతిలో కొన్ని డజన్ల మంది బందీలుగా ఉన్నారు. ఘర్షణ రోజురోజుకూ తీవ్ర రూపు దాలుస్తోంది. ఒప్పందాన్ని హిజ్బులా ఉల్లంఘిస్తే దానిపై దాడి చేసే హక్కు ఇజ్రాయిల్‌కు ఉంటుందా అనే విషయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనట్లు తెలుస్తోంది. ఒప్పందంలో ఈ అంశాన్ని కూడా చేర్చాలని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ పట్టుబట్టారు. అయితే లెబనాన్, హిజ్బుల్లా అందుకు అంగీకరించలేదు. అమెరికా, ఫ్రాన్స్ నేతృత్వంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందానికి ఇజ్రాయిల్ భద్రతా క్యాబినెట్ అంతకుముందు ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందిస్తూ 'ఇది మంచి వార్త' అని వ్యాఖ్యానించారు. గాజాలో కూడా కాల్పుల విరమణకు తన ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన చెప్పారు.

కాల్పుల విరమణ ఒప్పందంపై నెతన్యాహూ టీవీలో ప్రసంగిస్తూ 'ఈ ఒప్పందం గాజాలో హమాస్‌ను ఏకాకిని చేస్తుంది. ప్రధాన శత్రువు అయిన ఇరాన్‌పై దృష్టి సారించేందుకు ఇజ్రాయిల్‌కు అవకాశం ఇస్తుంది. ఒకవేళ హిజ్బుల్లా ఒప్పందాన్ని ఉల్లంఘించి కయ్యానికి కాలు దువ్వితే మేమూ దాడి చేస్తాం. ప్రతి ఉల్లంఘనకూ మా దాడి సమాధానమిస్తుంది' అని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ ఒప్పందంపై లెబనాన్ ఆపద్ధర్మ ప్రధాని నజీబ్ మికాతీ హర్షం వ్యక్తం చేశారు. స్థిరత్వాన్ని సాధించడంలో ఇది కీలక అడుగు అవుతుందని, నిరాశ్రయులైన ప్రజలు తిరిగి స్వస్థలాలకు చేరుకుంటారని ఆయన అన్నారు.

**శాంతి, సుస్థిరతకు అవకాశం : భారత్**

ఇజ్రాయిల్, హిజ్బుల్లా ఒప్పందంపై భారత్ హర్షం వ్యక్తం చేసింది. ఉద్రిక్తతలు సడలాలని, ఇరు పక్షాలు సంయమనం పాటించాలని, చర్చలు, దౌత్యాన్ని ప్రారంభించాలని తాము మొదటి నుండీ కోరుతూనే ఉన్నామని గుర్తు చేసింది. తాజా పరిణామాలు శాంతికి, సుస్థిరతకు దారితీస్తాయని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌లో ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహారాష్ట్రలో రాష్ట్రపతి పాలన విధించాలి

**–ఎంపీ సంజయ్‌రౌత్ కీలక వ్యాఖ్యలు!**

**ముంబై,**

మహారాష్ట్రలో తదుపరి ముఖ్యమంత్రిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ క్రమంలో శివసేన (యూటీబీ) నేత, ఎంపీ సంజయ్‌రౌత్ తాజాగా కీలక వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ గడువు ముగిసినప్పటికీ మహాయుతి కూటమి కొత్త ప్రభుత్వ ఏర్పాటులో విఫలమైందంటూ మండిపడ్డారు. ఇప్పటి వరకూ సీఎం ఎవరు అనేది నిర్ణయించలేకపోయింది. వెంటనే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు. "ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి భారీ మెజారిటీ సాధించింది. మంగళవారం (నవంబర్ 26)తో అసెంబ్లీ గడువు ముగిసింది. అయినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. ఇప్పటి వరకూ సీఎం ఎవరో కూడా నిర్ణయం తీసుకోలేదు. అలాంటప్పుడు ప్రభుత్వం ఏర్పాటు ఎలా సాధ్యమవుతుంది. శాసనసభ






పదవీకాలం ఈ నెల 26తో ముగిసింది కనుక రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి" అని సంజయ్‌రౌత్ అన్నారు. ఇదిలాఉంటే.. ఇటీవల వెలువడిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో మహాయుతి కూటమి బంపర్ మెజారిటీ సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు గాను ఈ కూటమి 230 స్థానాలను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 132, శివసేన 57, ఎన్‌సీపీ 41 స్థానాలు గెలుచుకున్నాయి. దీంతో ప్రభుత్వ ఏర్పాటు కోసం మంగళవారం సీఎం ఏక్‌నాథ్ షిండే తన పదవికి రాజీనామా చేశారు. ఇప్పుడు ఢిల్లీ పెద్దలు మహారాష్ట్ర తదుపరి సీఎంను నిర్ణయించడం కోసం తర్జనభర్జన పడుతున్నారు.

# నేటి నుంచి రైతుల పండుగ

(మొదటి తరువాయి)

వ్యవసాయ, దాని అనుబంధశాఖలతో కలిసి భారీ ఏర్పాట్లు చేశారు. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, లాభసాటి విధానాలు, వివిధ పంట ఉత్పత్తులపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆదర్శ రైతులు కూడా ఈ సదస్సులో పాల్గొంటున్నారు. ప్రజా ప్రభుత్వం తొలి ఏడాదిలో రైతు సంక్షేమం కోసం రూ.55,336 కోట్లను ఖర్చు చేసినట్టు ప్రకటించారు. రాష్ట్రంలో 66.77 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, 153 లక్షల టన్నుల దిగుబడి వచ్చింది. రూ. 2 లక్షల పంట రుణాలు మాఫీ చేశారు. 22.22 లక్షల మంది రైతుల కుటుంబాలకు దాదాపు రూ.17,870 కోట్ల రుణమాఫీ నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేస్తామని వేములవాడ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. రైతులకు ఇచ్చే ఉచిత విద్యుత్ కోసం ఈ ఏడాది రూ.10,444 కోట్లు సబ్సిడీగా చెల్లించినట్టు ప్రభుత్వం పేర్కొంది. రైతు భరోసా పథకం ద్వారా ఎకరానికి రూ.5 వేల చొప్పున మొత్తం 1,57,51,000 ఎకరాలకు రూ.7,625 కోట్ల నిధులను 69,86,519 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్టు తెలిపారు. నష్ట పరిహారం అందేలా పంటల బీమా ప్రీమియం రూ. 1,300 కోట్లు చెల్లించారు. ప్రమాదవశాత్తూ రైతు మరణిస్తే రూ.5 లక్షలు బీమా పరిహారం చెల్లించేలా రైతు బీమా పథకం ప్రీమియం రూ. 1,455 కోట్లు చెల్లించారు. ధాన్యం కొనుగోళ్లను కట్టుదిట్టంగా నిర్వహించామని ప్రభుత్వం తెలిపింది. దాదాపు 9 లక్షల మంది రైతుల నుంచి రూ.10,547 కోట్ల విలువైన ధాన్యాన్ని కొనుగోలు చేసినట్టు పేర్కొన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ప్రకటించారు. రైతు నేస్తం పథకం ద్వారా రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించి, సలహాలు సూచనలు అందచేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల్లో క్షేత్రస్థాయి పోస్టుల్ని భర్తీ చేశారు. ఆయిల్ పామ్ రైతులకు టన్నుకు రూ.2 వేలు అదనపు ఆదాయం లభించేలా అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలో క్యాప్టివ్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వ్యవసాయ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. రైతు రుణమాఫీకి రూ.17,869 కోట్లు, రైతు భరోసాకు రూ.7,625 కోట్లు, రైతు బీమాకు రూ.1,455 కోట్లు, పంటల బీమాకు రూ. 1,300 కోట్లు, ఉచిత విద్యుత్ కోసం రూ.10,444 కోట్లు, 2023-24 ధాన్యం కొనుగోళ్ళ కోసం రూ.10,547 కోట్లు, ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు ఇప్పటి వరకు రూ. 5,040 కోట్లు వ్యయం చేశారు. ఈ మొత్తం రూ. 54,280 కోట్లుగా ఉన్నట్టు ప్రకటించారు.

# క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

(మొదటి తరువాయి)

ఏర్పాట్లు చేయాలన్నారు. జీహెచ్‌ఎంసితో పాటు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కమిటీలు వేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో జరిగే క్రిస్మస్ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరవుతున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం హాజరవుతున్న వేడుకలకు రాష్ట్రంలో ఉన్న అన్ని చర్చిల అధిపతులు పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. అన్ని చర్చిల అధిపతులకు, క్రైస్తవ మత పెద్దలకు క్రిస్మస్ వేడుకల ఆహ్వానాలను అందజేయాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌కు సూచించారు. సోషల్ వర్క్, మెడికల్, ఎడ్యుకేషన్, లిట్రరీ, స్పోర్ట్స్, ఫైన్ ఆర్ట్స్ రంగాల్లో అవార్డులకు ఎంపికైన వారికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా లక్ష రూపాయలు, అదే విధంగా సోషల్ వర్క్, మెడికల్, ఎడ్యుకేషన్ అవార్డులకు ఎంపికైన సంస్థలకు రెండు లక్షల రూపాయల చెక్కులను అందిస్తామన్నారు. అవార్డులకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రధాన పత్రికల్లో నోటిఫికేషన్ వేయాలని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సబితను ఆదేశించారు. క్రిస్మస్ వేడుకలను అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

# మత మార్పిడికి పాల్పడడం రాజ్యాంగాన్ని మోసం చేయడమే

(మొదటి తరువాయి)

సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. క్రైస్తవ మతానికి చెందిన ఓ మహిళకు షెడ్యూల్డ్ కుల ధ్రువీకరణ పత్రాన్ని నిరాకరిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. కేవలం రిజర్వేషన్ ప్రయోజనాల కోసం నమ్మకం లేకపోయినా మతం మార్చుకోవడాన్ని సుప్రీం కోర్టు అనుమతించదని జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ ఆర్ మహదేవన్ బెంచ్? పేర్కొంది. ఇలా చేయడం కోటా విధానం ప్రాథమిక, సామాజిక లక్ష్యాలను బలహీనపరిచినట్లే అవుతుందని తెలిపింది. అలా చేయడం బలహీన వర్గాల కోసం ఉద్దేశించిన రిజర్వేషన్ల విధానాల స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, అది రాజ్యాంగాన్ని మోసం చేయడమే అవుతుందని అభిప్రాయపడింది. హిందూ తండ్రికి, క్రైస్తవ తల్లికి పుట్టిన సెల్వరాణి అనే ఓ మహిళ క్రైస్తవురాలిగా బాప్టిజం తీసుకుంది. ఆ తర్వాత తాను హిందువుగా ప్రకటించుకుంది. 2015లో పుదుచ్చేరిలోని అప్పర్? డివిజన్ కర్క్ పోస్ట్?కు దరఖాస్తు చేసుకునేందుకు ఎస్?సీ సర్టిఫికెట్? ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించింది. తాను హిందూ మతాన్ని ఆచరిస్తున్నానని, అందుకే ఎస్?సీ సర్టిఫికెట్ కావాలని కోరింది. విచారణ చేపట్టిన హైకోర్టు కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు నిరాకరించి. దీనిపై సుప్రీం కోర్టులో సవాల్ చేయగా హైకోర్టును తీర్పును సమర్థించింది. పిటిషనర్? క్రైస్తవ మతాన్ని ఆచరిస్తూనే ఉన్నారని, ఆమె తిరిగి హిందూ మతంలోకి మారినట్లు ఎటువంటి ఆధారాలు లేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్ తండ్రి షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి అయిన తర్వాత క్రిస్టియన్?గా మతం మార్చినట్లు డాక్యుమెంటరీ ఆధారాల ద్వారా స్పష్టమైనట్లు న్యాయస్థానం తెలిపింది. పిటిషన్?రకు వ్యతిరేకంగానే సాక్ష్యాలు ఉన్నాయని, కేవలం రిజర్వేషన్? ప్రయోజనాల కోసమే మత మార్పిడి చేసుకున్నట్లుగా అర్థమవుతుందని పేర్కొంది. అందుకే కుల ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చేందుకు అనుమతించమని సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొంది.

# ప్రజాపాలన అంటే నిర్బంధాలా..?

(మొదటి తరువాయి)

కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బంధిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. తెలంగాణ గడ్డ పోరాటాల పురిటిగడ్డ.. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా తిరుగుబాటులను అణిచివేయాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. దీంతో పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టగా.. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

# నవంబర్ 30 నుంచి బీఆర్ఎస్ 'గురుకుల బాట

(మొదటి తరువాయి)

లగచర్లలో... అల్లుడి కోసం... అదానీ కోసం... ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో పెడుతున్న ఫార్మా, సిమెంట్ ఫ్యాక్టరీల ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజనుల భూములను దొంగచాటుగా బలవంతంగా లాక్కునే కుట్రలకు ఇప్పటికైనా తెరదించాలని పేర్కొన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పాల్సి ఉందన్నారు.ఢిల్లీలో రైతుల సంఘటన శక్తిలో ఉన్న బలం ముందు దేశ ప్రధాని కూడా చివరికి వెనక్కి తగ్గిన చరిత్ర మన కళ్ళ ముందు ఉందని కేటీఆర్ రాసుకొచ్చారు. అనాలోచిత నిర్ణయాలతో మొన్న లగచర్లలో లడాయికి కారణమైన రేవంత్ రెడ్డి.. తన మొండి వైఖరి వల్లే నిన్న నిర్మల్‌లో ఇథనాల్ మంటలను రాజేశారని ఆరోపించారు.తలకు మాసిన ఆలోచనలతో రేపు రేవంత్ ఏ జిల్లాలోని... ఏ పచ్చని పంట పొలాల్లో ఎలాంటి బాంబు పేలుస్తారోననే భయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరిలో వ్యక్తమవుతోందన్నారు. ప్రజల అభీష్టం మేరకు నడుచుకోవడం... వారి మనోభావాలను గౌరవించడమనేది పాలకుడి ప్రాథమిక విధి అని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గుర్తెరిగి వెంటనే నిర్మల్



తరహాలోనే... సొంత నియోజకవర్గంలో లగచర్ల సమరానికి ఫుల్ స్టాప్ పెట్టాలని హితవు పలికారు. లేదంటే జరిగే పరిణామాలకు సీఎం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ గురుకుల బాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు పరిశీలిస్తారు. గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. 11 నెలల్లో 52 మంది విద్యార్థుల మృతి చెందారని, ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో ఈ ముఖ్యమంత్రి విద్యార్థులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కనీసం విద్యాశాఖ మంత్రి లేడన్నారు. అయినా సీఎం ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోవడం లేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులు చనిపోతున్నప్పటికీ ఒక్క సమీక్ష నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని హెచ్చరించారు. గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున అధ్యయన కమిటీ వేస్తున్నామన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. గురుకులాలను పరిశీలించి ఈ కమిటీ నివేదిక ఇస్తుందన్నారు. ఈ అంశాలను తాము అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు.

# చనిపోతే గానీ స్పందించరా...

(మొదటి తరువాయి)

పాయిజనింగ్ చాలా సీరియస్ అంశమని సీజే జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. పిల్లలు చనిపోతే గానీ స్పందించరా? అంటూ హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అధికారుల నిర్లక్ష్యానికి ఈ ఘటన నిదర్శనమని.. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదంటూ తలంటింది. ఘటనపై వారంలోగా కౌంటర్ దాఖలు చేస్తామని ప్రభుత్వం తరఫున న్యాయవాది హైకోర్టుకు తెలుపగా.. ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాల సేకరణకు వారం సమయం ఎందుకని నిలదీసింది. హైకోర్టు ఆదేశిస్తేనే అధికారులు పని చేస్తారా? అని నిలదీసింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే ఐదు నిమిషాల్లో హాజరవుతారని హైకోర్టు చెప్పింది. అధికారులకు కూడా పిలున్నారని.. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించింది. ఘటనపై భోజన విరామం తర్వాత పూర్తి వివరాలు అందజేస్తామని ఏఏజీ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని హైకోర్టులో పిల్ దాఖలైంది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో తరుచూ భోజనం వికటిస్తుందని ప్రభాకర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నారాయణపేట జిల్లా మానగూరు జడ్పీ పాఠశాలలో మంగళవారం ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. దాదాపు 30 మంది విద్యార్థులు వాంతులు, తలనొప్పి, కడుపు నొప్పితో బాధపడగా.. వెంటనే వారిని మక్తల్ ఆసుపత్రికి తరలించారు. పాఠశాలలో వారం వ్యవధిలోనే మరోసారి ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. ఇంతకు ముందు 20న ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వంద మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా ఫుడ్ పాయిజనింగ్ కేసులు వెలుగు చూస్తున్నాయి.

# నాది బీజేపీ డీఎన్ఏ..

(మొదటి తరువాయి)

మాట్లాడితే నీ డీఎన్ఏ ఏమిటని మాట్లాడుతున్నారని... తన డీఎన్ఏ భారతీయ జనతా పార్టీ అని చెప్పారు. మిగిలిన వారి మాదిరి 10 పార్టీలు మారిన డీఎన్ఏ తనది కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను డిసెంబర్ 1 నుంచి 5 వరకు ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాష్ట్రం నష్టపోతుందని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపడుతోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా నిర్మాణాత్మక పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

# గ్రూపులొద్దు..కలిసి పనిచేయండి

(మొదటి తరువాయి)

స్వస్తి చెప్పాలని హెచ్చరించారు. గ్రూపులుగా వీడి రాష్ట్ర, జిల్లా, మండల కార్యకర్తలను ఆగం చేయొద్దని స్పష్టం చేశారు. ఇకపై ఇలాంటి వాటిని పక్కన పెట్టి కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. అందరూ వ్యక్తిగత ఎజెండాలు విడిచి పార్టీ స్టాండ్ లో ముందుకు సాగాలని దిశా నిర్దేశం చేశారు. హైకమాండ్ ఇచ్చే సూచనలు సంయుక్తంగా అమలు చేసి వచ్చే ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలని స్పష్టం చేశారు. బుధవారం మధ్యాహ్నం 12 నుంచి 12:30 గంటల వరకు పార్లమెంట్‌లోని తన ఛాంబర్‌లో ప్రధాని నరేంద్ర మోడీ% తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజరు, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, గొడెం నగేశ్, ధర్మపురి అర్వింద్, ఈటెల రాజేందర్, రఘునందన్ రావు, రాజ్యసభ సభ్యులు డా లక్ష్మణ్, ఎమ్మెల్యేలు రాజా సింగ్, కాటిపల్లి వెంకటరమణ రెడ్డి, పాయల్ శంకర్, రాకేశ్ రెడ్డి, పాల్వాయి హరీష్‌బాబు, రాం రావు పవార్, సూర్య నారాయణ, బీజేపీ ఎమ్మెల్సీ, మొత్తం 16 మంది హాజరయ్యారు. దాదాపు అరగంట పాటు సాగిన ఈ సమావేశంలో తొలుత కిషన్ రెడ్డి, డీకే అరుణ ప్రధానికి రాష్ట్ర నేతలను పరిచయం చేశారు. ఒక్కొక్కరుగా ప్రధానికి శాలువా కప్పారు. అనంతరం వారి వారి నియోజక వర్గాల్లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగాల్సిన అభివద్ధి పనులు, కేంద్ర సాయానికి సంబంధించిన వివరాలను ప్రధానికి డీకే అరుణ అందజేశారు. ఆ ఫైల్‌ను తీసుకున్న తర్వాత తాజా ఎన్నికల్లో తెలంగాణ లో పార్టీ అధికారంలోకి రాకపోవడానికి గల కారణాలను ఒకొక్కటిగా ప్రధాని ప్రస్తావించారు. ఈ దిశలో రాష్ట్ర నేతలు గ్రూపులుగా ఏర్పడ్డ తీరు, ఆ గ్రూపుల ద్వారా ఒకరిపై ఒకరు చేసుకుంటున్న విమర్శలను వెల్లడించారు. ఇందులో భాగంగా ఎన్నికల ముందు పార్టీ అధ్యక్ష బాధ్యతల్లో మార్పులు చేయాల్సి వచ్చిందని చెప్పినట్లు తెలిసింది. అయినప్పటికీ%ా% ఇంకా గ్రూపు రాజకీయాలు కొనసాగుతున్నాయని, ఇలాంటి తీరు సరికాదని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. నేతలంతా ఏం చేస్తారో తనకు తెలియదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాషాయ జెండా ఎగరాలని చెప్పారు.

# డిసెంబర్ నెలలో స్కూళ్లకు భారీగా సెలవులు

(మొదటి తరువాయి)

వీటిల్లో 7 సెలవులు ప్రభుత్వ హాలీడేస్ కాగా... రెండు ఐచ్ఛిక సెలవులుగా ఉన్నాయి. ఇక మిషనరీ స్కూల్స్ లో 10 రోజులు హాలీడేస్ ఇచ్చే అవకాశం ఉంది. క్రిస్మస్ పండుగ సందర్భంగా మిషనరీ పాఠశాలల్లో అదనపు సెలవులు ఉంటాయి. డిసెంబర్ నెలలో పాఠశాలలకు భారీగా రానున్నాయి. డిసెంబర్ లో 5 ఆదివారాలు, ఒక రెండో శనివారం, క్రిస్మస్ హాలీడే కలిపి 7 రోజులు హాలీడేస్ ఉన్నాయి. కొన్ని పాఠశాలలకు క్రిస్మస్ ముందు లేదా తర్వాత రోజు కూడా సెలవు ప్రకటిస్తారు. దీంతో సెలవులు 8 రోజులకు చేరాయి. మిషనరీ పాఠశాలలకు విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం 5 రోజులు సెలవులు ప్రకటించింది. డిసెంబర్ 23 నుంచి 27 వరకు ఐదు రోజులు హాలీడేస్ మంజూరు చేశారు. డిసెంబర్ లోని 5 ఆదివారాలు కలిపి మొత్తం 10 రోజులు మిషనరీ పాఠశాలలకు సెలవులు రానున్నాయి. రెండో శనివారం సెలవుతో కలిపితే వీటి సంఖ్య 11కు చేరుతుంది. ఇక జనవరిలో సంక్రాంతి సెలవుల సందడి ఉంటుంది. డిసెంబర్, జనవరి సెలవులు పూర్తైన తర్వాత విద్యార్థులు పరీక్షల సన్నద్ధత మొదలవుతుంది. ఏపీలో క్రిస్టియన్ మైనారిటీ విద్యాసంస్థలకు డిసెంబర్ 22 నుంచి 29 సెలవులు ఇచ్చే అవకాశం ఉంది. ఏపీలో మరోసారి స్కూళ్లకు వరుస సెలవులు వచ్చే అవకాశాలున్నాయి. వర్షాకాలంలో భారీ తుపానులు, వరదల కారణంగా భారీగా సెలవులు వచ్చిన సంగతి తెలిసిందే. మరోసారి ఏపీకి తుపాను ముప్పు పొంచివుండటంతో అప్రమత్తం ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. దీంతో వర్షప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు ప్రకటించే అవకాశం వుంది. తీవ్ర వాయుగుండం ప్రభావం ఏపీ, తమిళనాడుతో అండమాన్ నికోబార్ దీవులపై ఎక్కువగా ఉంటుదని ఐఎండీ తెలిపింది.

## సంపాదకీయం

# రైతు కోసం గళమెత్తిన సంస్కర్త పూలే

పందొమ్మిదో శతాబ్దపు సంఘ సంస్కర్తల్లో రైతుల గురించి పోరాడిన ఏకైక సంస్కర్త జ్యోతిరావు పూలే. జ్యోతిరావు తండ్రి గోవింద్‌రావు పూల వ్యాపారి. ఆయనకు కొంత భూమి ఉండేది. ఆ భూమిలో పూలు పండించి పూణేలోని తన అంగట్లో అమ్మేవాడు. చిన్నతనంలో జ్యోతిరావు కూడా పొలంలో, అంగడిలో పనిచేశాడు. అలా రైతు నేపథ్యం నుంచి వచ్చిన పూలే ఆనాటి శూద్రులు, అతి శూద్రులు ఎదుర్కొంటున్న వివిధ సామాజిక సమస్యలతో పాటు రైతు, కార్మిక సమస్యలపై కూడా పోరాడారు. ఖండే అనే నాయకుడితో కలిసి బొంబాయిలో కార్మిక సంఘం నెలకొల్పారు. సామాజిక ఆర్థిక పోరాటాలు రెండింటినీ ఆయన నిర్వహించారు. చాలావరకు సామాజిక దోపిడీ, ఆర్థిక దోపిడీ కలిసే ఉంటాయి. మనదేశంలో మరీనూ. ప్రతిఘటన లేని ఆర్థిక దోపిడీకి సామాజిక పెత్తనం ఒక అదనపు సాధనం. గనుక పూలే రెండు రంగాల్లోనూ పోరాడారు. పూణే ప్రజలచేత 'మహాత్మా'అన్న బిరుదు పొందిన పూలే 11 ఏప్రిల్ 1827 పూణేలో పుట్టారు. 28 నవంబర్ 1890న మరణించారు. ఆనాటి రైతు సమస్యలను బ్రిటిష్ పాలకుల దృష్టికి తెచ్చి వాటి పరిష్కారానికి పూలే పలు చర్యలు సూచించారు. దాదాపు 150 ఏండ్ల క్రితం 1883లో సేత్కార్యాచ అసూడ్ (సేద్యగాని చర్నాకోల) పేరుతో మరాఠీలో రైతు సమస్యలపై ఒక పుస్తకం రాశారు. అందులో రైతు శ్రమ ఫలితాన్ని మతాచారాల పేర పురోహితులు, భూవివాదాల్లో రైతులను మోసగించి కులకర్ణీలు, బ్రాహ్మణ ఉద్యోగులు అలాగే ప్రభుత్వం వారిని ఎలా దోచుకొంటుందో వివరంగా చెప్పారు. ఆ సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సూచనలు నేటికీ ప్రాసంగికమైనవే. సనాతన ధర్మం ఎంతో గొప్పదని ఎవరు ఎంత భుజం చరిచినా అది శూద్రులను, అతిశూద్రులను ఎలాంటి హక్కుల్లేని దాసులుగా మార్చింది. దాచి పెట్టలేని నిజం వర్ణాశ్రమ ధర్మాన్ని, పురాణాలను, వేదాలను సవాలు చేసిన పూలే రైతుల కోసం కూడా గళం విప్పారు. పూలేకు ముందు ఆ తర్వాత వచ్చిన అనేక మంది సంస్కర్తలు ఆంగ్లేయ విద్యతో, యూరప్ ఉద్యమాలతో స్ఫూర్తి పొంది హిందూమతంలో సంస్కరణల కోసం కృషి చేశారు. జవహర్‌లాల్ నెహ్రూ చెప్పినట్టు ఆ సంస్కరణ సమాజంలోని అట్టడుగు తరగతులకు చేరలేదు. పూలే దానికి ఒక మినహాయింపు. హిందూ మతంలో సముద్రయానంపై విధించిన నిషేధం కూడా దోపిడీలో భాగమేనని పూలే చెప్పారు. పశ్చిమ దేశాల విజ్ఞానాన్ని, అక్కడి మానవ హక్కులను మన దేశవాసులు గమనిస్తే తమ ఆధిపత్యానికి దోపిడీకి శిక్షఉషకు ప్రమాదం ఏర్పడుతుందని భావించిన ఆధిపత్య వర్గాలు భయపడ్డాయన్నారు. శూద్ర రైతుల దయనీయ స్థితికి మతపరమైన, సమాజపరమైన కారణాలు అనేకం ఉన్నాయి. వాటిలో కొన్నింటినైనా చర్చకు పెట్టాలన్న ముఖ్య ఉద్దేశంతో తాను ఆ గ్రంథం రాశానని చెప్పారు. మతం మానవ కల్పితమే కాదు, అది క్రూరమైందని కూడా ఆయన అన్నారు. బ్రాహ్మణోమమ దైవతం (బ్రాహ్మణుడే నా దైవం) అన్న భావన శూద్రరైతుల్లో ఉన్నంత కాలం వారు పీడన నుండి బయటపడరని చెప్పారు. రైతును పురోహితులు దోచుకోవడం అతను పుట్టకముందు నుండే మొదలు పెడతారు. అతను చనిపోయాక ఉత్తర క్రియలు, శ్రాద్ధకర్మల పేర కూడా ఎలా దోచుకుంటారో పూలే తన పుస్తకంలో వివరంగా చెప్పారు. రైతు తల్లి గర్భం ధరించగానే బ్రాహ్మణులు ఏవేవో తంతులు జరిపించి కాసులు రాల్చుకొంటారు. ప్రతియేటా తద్దినాల పేర విందు భోజనాలు ఆరగించి సంభావనలు లాగుతారు. హిందువుల పండుగలన్నీ బ్రాహ్మణుల దోపిడీకి అక్కరకొచ్చేవే అంటూ పండుగల వారిగా రైతులను ఎలాదోచుకొంటారో విశదీకరించారు. క్రీ.పూ. చార్వాకులు కూడా ఇదే ప్రశ్నించారు. అతిథికి మిద్దె మీద పీట వేసి కింది అంతస్తులో విస్తరి వేసి వడ్డిస్తే మిద్దెమీదికి వాడికి చేరవు కదా? అని వారు ప్రశ్నించారు. బ్రిటిష్ పాలనలో రైతులపై విధిస్తున్న భూమిశిస్తును కట్టలేని స్థితిని వివరిస్తూ పూలే ఒక విషయం చెప్పారు. గతంలో రాజుల దగ్గర సైనికులుగా, గుర్రాలు, పశువులు, ఒంటెలు, ఏనుగులకు సంరక్షకులుగా శూద్ర,అతిశూద్రుల కుటుంబాల నుండి ఎవరో ఒకరు ప్రభుత్వ ఉద్యోగంలో ఉండేవారు. దానివల్ల ఆ కుటుంబాలకు భూమిశిస్తు చెల్లించడం ఒక సమస్యగా ఉండేది కాదు. ఇప్పుడు ఆ ఉద్యోగాలు లేవు, రైతులు భూమి శిస్తు చెల్లించలేక పోతున్నారని చెప్పారు. కేవలం కొద్దిపాటి భూమిపై ఆధారపడి జీవించే వారి స్థితి నేటికీ అలాగే ఉంది. భూమి శిస్తు లేకపోయినా రైతులు రకరకాల దోపిడీకి గురవుతున్నారు. తక్కువ భూమి గల రైతులు గొర్రెలు, మేకలు, పశువులు పెంచుకొని కొంత ఆదాయం పొందేవారు. ఇప్పుడు బ్రిటిష్ పాలకులు పచ్చిక బయళ్లను కూడా అడవులుగా గుర్తించడం వల్ల జీవాలకు మేత లేదు. కనుక అడవుల్లో కొంత భాగాన్ని పశ్చికబయళ్ల కోసం గ్రామాలకు అప్పగించాలని కోరారు. బ్రిటిష్ వారి పారిశ్రామిక ఉత్పత్తులతో పోటీ పడలేక దేశంలోని వృత్తిదార్లు బతుకుదెరువు కోల్పోయారు. తిండి దొరకని స్థితికి చేరారు. అర్ధాకలితో చస్తున్నారని పూలే చెప్పారు. రైతులు ఆత్మహత్యల గురించి ఆయన ప్రస్తావించలేదు. కాని ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచన మాత్రం వారికి కలుగుతోందని చెప్పారు. బ్రిటిష్ ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఆయన వదల్లేదు. చదువు పేర స్థానిక పన్నుల రూపంలో లక్షల రూపాయలను వసూళ్లు చేస్తున్నారు. అందులో మూడోవంతు మాత్రమే అక్కడో ఇక్కడో స్థాపించిన బడులపై ఖర్చు చేస్తున్నారు. పిల్లలను బడికి పంపిస్తున్న రైతుల సంఖ్య చాలా తక్కువ. రైతులందరూ తమ పిల్లలను తప్పక బడికి పంపాలన్న ఉత్తర్వును ప్రభుత్వం జారీ చేయాలని పూలే కోరారు. అలా నిర్బంధోచిత విద్య ఆవశ్యతను ఆయన నూట యాభై ఏండ్ల క్రితమే చెప్పారు. పాఠాలు చెప్పాల్సిన పంతుళ్లు పవిత్రం, అపవిత్రం అంటూ విద్యార్థులపై ఆంక్షలు పెడతారు. పైగా క్రతువుల నిర్వహణల్లో మునిగి చదువు చెప్పరు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదు. కనుక రైతుల పిల్లలు ఎంతమంది చదువుకున్నారు. వారిలో ఎంత మంది ప్రభుత్వ ఉద్యోగంలో చేరగల విద్యను పొందారు అన్న విషయాలను ప్రభుత్వం రాజ పత్రం (గెజిట్)లో ప్రచురించాలని పూలే డిమాండ్ చేశారు. అన్ని ఉద్యోగాలను బ్రాహ్మణులే కాజేయకుండా వారి జనాభా ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాలు కేటాయించి మిగిలిన ఉద్యోగాలను శూద్ర, అతిశూద్రులకు ఇవ్వాలన్నారు.

**(నేడు జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి)**

# మహా' ఫలితాల మతలబు ఏమిటి?

ప్రజల సమస్యలు, సానుభూతి పవనాలు, తీవ్రమైన ప్రభుత్వ వ్యతిరేకత, భావోద్వేగపరమైన అంశాలు ఆధారంగా ఎన్నికల్లో విజయం సాధించడం భారతదేశంలో సర్వసాధారణం. 1998లో ఢిల్లీలో ఉల్లిగడ్డల ధరలు విపరీతంగా పెరిగినందుకు బీజేపీ ప్రభుత్వం పరాజయం పాలయింది. 'పేదలు ఉల్లిగడ్డలు ఎప్పుడూ తినరు.. కేవలం పై వర్గాలే ఉల్లిగడ్డలు తింటాయి' అని వ్యాఖ్యానించి ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నందుకు బీజేపీ అధిష్ఠానం సాహెబ్‌సింగ్ వర్మతో రాజీనామా చేయించి సుష్మా స్వరాజ్‌ను ముఖ్యమంత్రిగా నియమించింది. తొలి కేబినెట్ సమావేశంలోనే ఉల్లిగడ్డల ధరలను తగ్గించేందుకు సుష్మా స్వరాజ్ నిర్ణయం తీసుకున్నారు. కాని అప్పటికే బీజేపీ సర్కార్ పట్ల ప్రజా వ్యతిరేకత ప్రబలడంతో ఓటమిపాలై షీలా దీక్షిత్ నేతృత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2013లో షీలాదీక్షిత్ సర్కార్ ఓడిపోవడానికి కూడా ఉల్లిగడ్డల ధరల పెరుగుదల ఒక కారణమవడం విశేషం. అధిక ధరలు, నిరుద్యోగం, రైతాంగ సమస్యలు, గిట్టుబాటు ధరలు లేకపోవడం, కుంభకోణాలు, అత్యాచారాలు విద్యుత్ ఛార్జీల పెరుగుదల వంటివి అనేక సందర్భాల్లో దేశంలో ఎన్నికల ఫలితాలను నిర్ణయించిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు అలాంటి వాటి వల్ల ప్రభుత్వాలు ఓడిపోయాయని ఎవరైనా చెప్పగలరా? దేశంలో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత వల్ల ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. తెలుగుదేశం, బిజూ జనతాదళ్ లాంటి పార్టీలు అలా అధికారంలోకి వచ్చినవే. జాతీయ స్థాయిలో ఎమర్జెన్సీ, ఇందిరాగాంధీ మరణం కూడా ఎన్నికల ఫలితాలను నిర్దేశించాయి. యూపీఏ హయాంలో కుంభకోణాలు, అవినీతి వల్ల 2014లో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభంజనం వీచిందనడంలో సందేహం లేదు. మతపరమైన భావోద్వేగాలను బీజేపీ ఎన్నికలకు ఉపయోగించుకోవడం కూడా ఎవరూ కాదనలేని విషయం. కర్ణాటకలో యడ్యూరప్ప హయాంలో అవినీతి, అక్రమాలు, తెలంగాణలో కేసీఆర్ పదేళ్ల పాలన, వ్యవహారశైలి పట్ల వ్యతిరేకత, ఆంధ్రప్రదేశ్‌లో జగన్ అరాచక పాలన కూడా ఎన్నికల ఫలితాలను నిర్దేశించిన విషయం అందరికీ తెలుసు. స్థూలంగా చూస్తే రాజకీయ పార్టీల తలరాతలు ప్రజా వ్యతిరేక, ప్రజా అనుకూల తరంగాల ఆధారంగా నిర్ధారితమవుతాయి. కొన్నిసార్లు అంతర్గతంగా ప్రజా వ్యతిరేకత చాప క్రింద నీరులాగా ప్రవేశిస్తుంది. కాని ఇది కూడా కనిపెట్టలేనిది కాదు. స్థానికంగా పర్యటించినప్పుడు, ప్రజలతో మాట్లాడినప్పుడు అర్థం అవుతుంది. 'నేను మా ఊళ్లో అడుగుపెట్టినప్పుడు నన్నెప్పుడూ బిడ్డా అని పలకరించే ఒక వృద్ధురాలు ఈ సారి నన్ను చూడగానే ముఖం తిప్పుకుంది. ఆమె నాకు ఏమీ చెప్పలేదు కాని నాకు ఓడిపోతానన్న విషయం




మాత్రం అర్థమైంది' అని దివంగత కాంగ్రెస్ నేత జైపాల్‌రెడ్డి ఒకసారి మాటల సందర్భంలో చెప్పారు. అందువల్ల నేతలు తమ గెలుపోటముల గురించి లీలగానైనా అంచనా వేయగలరనడంలో అతిశయోక్తి లేదు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనం వీస్తుందని కొన్ని సంస్థలు తేల్చినా అది 240 సీట్లకే పరిమితమవుతుందని అంచనా వేసిన వారు కూడా లేకపోలేదు. ప్రజలకు ఒక పార్టీ పట్ల మోజు తగ్గినా, ప్రతిపక్ష పార్టీ పట్ల కూడా సానుకూలత లేనప్పుడు సంకీర్ణ ప్రభుత్వాలు ఏర్పడతాయని 2024లోనే కాదు, అంతకు ముందు కూడా రుజువైంది. ప్రభంజనం ఉన్నదా లేదా, పైకి కనపడని ప్రజా వ్యతిరేకత ఉన్నదా లాంటి అంశాలు ఎన్నికల ప్రచార సమయంలోనూ, పోలింగ్ రోజు, పోలింగ్ శాతంలోనూ కూడా వ్యక్తమవుతాయి. అదే సమయంలో పూర్తి ఎన్నికల నిర్వహణ, పోలింగ్ బూత్‌ల స్థాయి వ్యూహరచన, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులను తమ వైపునకు తిప్పుకోవడం, భారీ ఎత్తున డబ్బులు పంచిపెట్టడం వల్ల ఎన్నికల ఫలితాలు తారుమారు అవుతాయని చెప్పడానికి వీల్లేదు. అలా చేయగలిగిన శక్తి ఉన్నప్పటికీ అధికార పార్టీలు పరాజయం చెందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. నృత్యం చేయలేని నర్తకి నాట్యవేదికను నిందించినట్లు సాధారణంగా ఓడిపోయిన పార్టీలు ఈవీఎంలను మేనేజ్ చేశారనో, రిగ్గింగ్ జరిగిందనో నిందలు వేస్తాయి. అయితే కొన్ని ఫలితాలు అనూహ్యంగా వచ్చినప్పుడు అందుకు కారణాల గురించి లోతుగా చర్చించడం అనావశ్యకం మాత్రం కాదు. హరియాణా, మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు ఇలాంటి చర్చలకే దారి తీస్తున్నాయి. ఢిల్లీలో ఉల్లిగడ్డల ధరలు ఒకప్పుడు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసినట్లు హరియాణా, మహారాష్ట్ర ఎన్నికలకు సంబంధించి ప్రభావితం చేయగలిగిన సమస్యలు ఎన్నో ఉన్నాయి. పదేళ్ల ప్రజా వ్యతిరేకత, భారీ ఎత్తున నిరుద్యోగం, కనీస మద్దతు ధర వంటి రైతాంగ సమస్యలు, పట్టణ ఓటర్ల అసంతృప్తి, మహిళా మల్లయోధుల నిరసనలు, పూర్తి చేయని ఎన్నో హామీల వల్ల పదేళ్ల తర్వాత హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రానున్నదని, ఇండియా టుడేతో పాటు పలు పత్రికలు, సర్వే సంస్థలు కూడా అంచనా వేశాయి. కాని ఫలితాలు అందుకు భిన్నంగా వచ్చాయి. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా హరియాణా ఎన్నికల ఫలితాలు వచ్చాయని కాంగ్రెస్ తీవ్రంగా ఆరోపించింది. కాని ఈ ఆరోపణలపై అంతగా చర్చ జరగలేదు. ఇవి మచ్చలేని ఎన్నికలు అని ఎన్నికల కమిషన్ అభివర్ణించింది. తాజాగా మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు అనేక మందిని మరింత ఆశ్చర్యపరిచాయి. మహారాష్ట్రలో బీజేపీ, దాని మిత్రపక్షాలు ఇంత భారీ ఎత్తున విజయం సాధిస్తాయని ఎవరూ ఊహించలేదు. ముఖాముఖి ఎన్నికల్లో బీజేపీని కాంగ్రెస్ గట్టిగా ఢీకొనలేకపోతోందని హరియాణా ఎన్నికల తర్వాత విమర్శలు వచ్చినప్పటికీ 1962 తర్వాత మొదటిసారి కనీవినీ ఎరగని రీతిలో ఘోరపరాజయం చెందుతుందని, 101 సీట్లకు పోటీ చేసి కేవలం 15 సీట్లు మాత్రమే దక్కించుకుంటుందని ఎవరూ అంచనా వేయలేదు. అయిదునెలల క్రితం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 48 సీట్లకు గాను 13 సీట్లు దక్కించుకుని ఏకైక పెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్ ఇంత ఘోరంగా ఓడిపోతుందని ఎవరు ఊహించగలరు? ఇదే షాక్‌కు శివసేన వ్యవస్థాపకుడు బాల్‌ఠాక్రే కుమారుడు ఉద్ధవ్‌ఠాక్రే శివసేన కూడా గురయ్యారు. పోటీ చేసిన 95 సీట్లలో 20 సీట్లు మాత్రమే దక్కుతాయని, తన పార్టీని చీల్చిన ఏక్‌నాథ్ శిందే వర్గం చేతుల్లోనే 36 సీట్లలో ఓడిపోతామని ఆయన కలలో కూడా ఊహించి ఉండరు. ఇక శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ పరిస్థితి దయనీయంగా మారింది. తన గురువు వసంత దాదా పాటిల్‌పై తిరుగుబాటు చేసి 38 సంవత్సరాల వయస్సులో ముఖ్యమంత్రి అయిన శరద్ పవార్ రాజీవ్ మరణానంతరం ప్రధానమంత్రి పదవి ఆశించి భంగపడ్డారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాలను శాసించిన పవార్ ఎంవీఏ కూటమి నేర్పాటు చేసి బీజేపీ పన్నిన అన్ని ఎత్తుగడలనూ భగ్నం చేశారు. అలాంటి పవార్ 83 ఏళ్ల వయస్సులో చివరకు మోదీ, అమిత్ షా వ్యూహరచనకు చిత్తు అయిపోయారు.

# ప్రభుత్వాలపై ఎందుకింత వ్యతిరేకత!

ఏడాది ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో ఎన్నికలు జరిగిన పది ప్రధాన దేశాల్లో ఓటర్ల ఆగ్రహమే ఫలితాల్లో కనిపించింది. అమెరికా, దక్షిణ కొరియా, దక్షిణాఫ్రికా, ఫ్రాన్స్, యునైటెడ్ కింగ్‌డమ్, జపాన్, అ÷-జర్గ÷ంటీనా, సోలమన్ ఐలాండ్స్, తైవాన్, ఇండోనేసియా... తో పాటు ఈ ఏడాది మరో 50కి పైగా దేశాల మధ్యా ఓ అరుదైన సారూప్యత ఏర్పడింది. అది, ఈసారి ఎన్నికలకు వెళ్లిన దేశాల్లో 80శాతం ప్రభుత్వాలు పరాజయం పాలయ్యాయి. ఈ ఏడాది 70కి పైగా దేశాలు ఎన్నికల పరీక్షకు నిలవడంతో 2024ను ప్రజాస్వామ్య సంవత్సరంగా అభివర్ణించారు. భారత్, అమెరికా, యూకే, యూరోపియన్ యూనియన్, జపాన్, రష్యాలాంటి అనేక చోట్ల ఈ ఏడాది ఎన్నికలు జరిగాయి. అంటే... ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ మంది తమ మనసులో మాట వినిపించే సంవత్సరంలా నిలిచిందీ 2024. అయితే ఈ దేశాల్లోని మానవాళి మాత్రం తాము 'బతకలేకపోతున్నాం... పరిస్థితులను మార్చండి... పాలనను మెరుగు పర్చండి' అని నినదించింది. ఖండాలు, దేశాలు, పార్టీలు, నాయకులు, సంస్కృతులు వేరైనా అన్ని దేశాల్లోనూ ప్రజల రియాక్షన్ ఒక్కటే. అమెరికా నుంచి ఇండోనేసియా దాకా ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల తీర్పుల అంతరార్థం ఇదే! మరికొన్ని రోజుల్లో సంవత్సరం ముగుస్తున్న దశలో... అనేక దేశాల్లో ఎన్నికలు ముగిశాయి. వీటిలో కేవలం 20శాతం దేశాల్లో మాత్రమే పార్టీలు అధికారాన్ని నిలబెట్టుకున్నాయి. మిగిలిన అన్ని చోట్లా అధికారంలో ఉన్నవారికి ప్రజలు చుక్కలు చూపించారు. వ్యతిరేక ఓటుతో గద్దె దించారు. యూకేలో దశాబ్దకాలంగా అధికారంలో ఉన్న కన్జర్వేటివ్ పార్టీని ఇంటికి పంపించారు. న్యూజిలాండ్‌లో లేబర్ పార్టీ, జపాన్‌లో ఎల్‌డీపీ, దక్షిణాఫ్రికాలో ఏఎన్‌సీ, తాజాగా అమెరికాలో




డెమోక్రాట్లను తిరస్కరించారు. దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా పార్టీ ఎఎన్‌సీ...
తొలిసారి ఘోర పరాజయం పాలైంది. అమెరికాలో అధికారంలో ఉన్న పార్టీ వరసగా ఓడిపోవటం వందేళ్లలో ఇదే తొలిసారి. ఒబామా తర్వాత డెమోక్రాట్లు, ట్రంప్ తర్వాత రిపబ్లికన్లు, మళ్లీ ఇప్పుడు బైడెన్ తర్వాత డెమోక్రాట్లు ఓడిపోయారు. నాలుగేళ్ల కిందట వద్దనుకున్న, అనేక కేసులు ఎదుర్కొంటున్న డొనాల్డ్ ట్రంప్‌నే మళ్లీ అమెరికా ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించుకున్నారంటే వారిలో ప్రస్తుత ప్రభుత్వ తీరుపై ఎంత వ్యతిరేకత గూడుకట్టుకుందో తెలిసిపోతోంది. ండాల సరిహద్దులను చెరిపేసుకొని ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ఈ ట్రెండ్ చెబుతున్నదేంటి? భౌగోళిక రాజకీయాలు, యుద్ధాలు, ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, వలసలు... అన్నీ కలిసి రాజకీయ, సామాజిక, ఆర్థిక అసమానతలు, అస్తవ్యస్త పరిస్థితులను సృష్టిస్తున్నాయి. అవి అన్ని దేశాల్లోనూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయి. మరోవైపు ఉద్యోగాలు ఊడుతుండటం, జీతాలు తగ్గుతుండటం... ప్రజలను అనిశ్చితిలోకి నెట్టాయి. ఫలితమే ప్రభుత్వాలపై వ్యతిరేకత! ప్రపంచవ్యాప్త వ్యతిరేకత! మరి కొత్త నాయకత్వాలు ప్రజల తీర్పును ఎంతవరకు గౌరవిస్తాయనేది చూడాల్సివుంది.

# 8,85,56,75,90,000.00/- విలువైన ఆస్తులు కలిగిన రతన్ టాటా చివరి మాటలు...

ప్రజా స్వేచ్ఛ
వ్యాపార రంగంలో విజయ శిఖరాలకు చేరుకున్నాను. ఇతరుల దృష్టిలో నా జీవితం ఒక విజయం. అయితే, నాకు పనితప్ప సంతోషం లేదు. డబ్బు అనేది నేను ఉపయోగించే సత్యం. ఈ తరుణంలో, హాస్పిటల్ బెడ్‌పై పడుకుని, నా జీవితమంతా గుర్తుచేసుకుంటూ, నేను గర్వంగా ఉన్న గుర్తింపు మరియు డబ్బు మరణం ముందు అబద్ధం మరియు విలువ లేకుండా పోయిందని నేను గ్రహించాను. మీరు మీ కారును నడపడానికి లేదా డబ్బు సంపాదించడానికి ఒకరిని నియమించుకోవచ్చు. కానీ, బాధపడి చనిపోయే వ్యక్తిని నియమించుకోలేవు. పోయిన మెటీరియల్ వస్తువులు దొరకవచ్చు. కానీ పోగొట్టుకున్నప్పుడు ఎప్పటికీ దొరకని విషయం ఒకటి ఉంది - అదే "జీవితం". జీవితంలో మనం ఏ దశలో ఉన్నా, కాలంతో పాటు గుండె ఆగిపోయే రోజుని ఎదుర్కోవలసి వస్తుంది. మీ కుటుంబాన్ని, జీవిత భాగస్వామిని మరియు స్నేహితులను ప్రేమించండి...?? వారితో మంచిగా ప్రవర్తించండి, వారిని మోసం చేయకండి, ఎప్పుడూ నిజాయితీగా లేదా నమ్మకద్రోహంగా ఉండకండి. మనం పెద్దయ్యాక మరియు జ్ఞానవంతులయ్యే కొద్దీ, రూ. 300 లేదా రూ. 3000 లేదా రూ. 2-4 లక్షల విలువైన వాచ్‌ని ధరించడం - ప్రతిదీ ఒకే సమయాన్ని ప్రతిబింబిస్తుందని మనం క్రమంగా గ్రహిస్తాము. మన దగ్గర రూ. 100 లేదా రూ. 500 పర్సు ఉన్నా - లోపల అంతా ఒకటే. మనం రూ.5 లక్షల కారు నడిపినా, రూ.50 లక్షల విలువైన కారు నడిపినా.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

మార్గం మరియు దూరం ఒకే విధంగా ఉంటాయి మరియు మేము ఒకే గమ్యాన్ని చేరుకుంటాము. మనం నివసించే ఇల్లు 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నా, 3000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నా - ఒంటరితనం అన్ని చోట్లా ఒకేలా ఉంటుంది. మీ నిజమైన అంతర్గత ఆనందం ఈ ప్రపంచంలోని భౌతిక వస్తువుల నుండి రాదు అని మీరు గ్రహిస్తారు. మీరు ఫస్ట్ క్లాస్‌లో ప్రయాణించినా, ఎకానమీ క్లాస్‌లో ప్రయాణించినా, విమానం కిందకు దిగితే దానితో పాటు మీరు కూడా కిందకు దిగుతారు. కాబట్టి.. మీకు స్నేహితులు, సోదరులు మరియు సోదరీమణులు ఉన్నారని నేను ఆశిస్తున్నాను, మీరు వారితో మాట్లాడతారు, నవ్వుతారు, పాడతారు, ఆనందం మరియు దుఃఖం గురించి మాట్లాడతారు, అది నిజమైన ఆనందం!

**కాదనలేని జీవిత సత్యం:**
ధనవంతులు కావడానికి మీ పిల్లలకు చదువు చెప్పకండి. సంతోషంగా ఉండడం నేర్పండి. వారు పెద్దయ్యాక వస్తువుల విలువ, ఖర్చు కాదు. జీవితం అంటే ఏమిటి? జీవితాన్ని బాగా అర్థం చేసుకోవడానికి మూడు ప్రదేశాలు ఉన్నాయి:
- ఆసుపత్రి - జైలు - శ్మశానవాటిక

ఆరోగ్యం కంటే మెరుగైనది ఏదీ లేదని ఆసుపత్రిలో మీరు అర్థం చేసుకుంటారు. స్వేచ్ఛ ఎంత విలువైనదో జైల్లో చూస్తారు. మరియు శ్మశానవాటికలో జీవితం ఏమీ లేదని మీరు గ్రహిస్తారు. నేడు మనం నడిచే భూమి రేపు మనది కాదు. ఇక నుండి మర్యాదగా ప్రవర్తిద్దాం మరియు మనకు లభించినందుకు మన తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలుపుదాం. మీరు ఈ సందేశాన్ని వేరొకరితో పంచుకోగలరా? మరియు నేను నా తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు, నా బంధువులు, పొరుగువారు, స్నేహితులు, కుటుంబం, నా సమాజం, నా దేశం అందరినీ ప్రేమిస్తున్నాను. అందరూ ఆశీర్వదించబడాలి. అందరూ బాగుండాలి....

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# తెలంగాణలోని ఈ మూడు జిల్లాల్లో కొత్త ఎయిర్ పోర్టులు..!!




ప్రజా స్వేచ్ఛ
వరంగల్‌తోపాటు మరో మూడు చోట్ల ఎయిర్పోర్టులు మంజూరు చేయాలని, వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సీఎం రేవంత్రెడ్డి కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అన్ని రకాల చర్యలు చేపడుతున్నామని, కేంద్రం కూడా సహకరించాలని, అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాల్వంచ, అంతర్గాం, ఆదిలాబాద్లోనూ..! భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు గతంలో గుర్తించిన స్థలం అనువుగా లేనందున ప్రత్యామ్నాయంగా పాల్వంచలో 950 ఎకరాలు గుర్తించామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి సీఎం రేవంత్రెడ్డి తీసుకెళ్లారు. ఆ భూమి వివరాలు ఏఏఐకి అందజేశామని, వెంటనే విమానాశ్రయ ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. పెద్దపల్లి జిల్లాలో గతంలో గుర్తించిన భూమి ఎయిర్ పోర్ట్ నిర్మాణానికి అనువుగా లేదని ఏఏఐ ప్రీ-ఫీజుబిలిటీ సర్వేలో తేలిందన్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్గాంలో 591.24 ఎకరాలు గుర్తించిందని, అక్కడ ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు పర్మిషన్ ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆదిలాబాద్‌లో భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆధ్వర్యంలో ఇప్పటికే 369.50 ఎకరాల భూమి ఉందని, పూర్తి స్థాయి కార్యకలాపాలకు అదనంగా 249.82 ఎకరాలు అవసరమని చెప్పారు. అదనంగా అవసరమైన భూమి సేకరించి అప్పగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న ఆదిలాబాద్ కు వెంటనే ఎయిర్పోర్ట్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. సీఎం వెంట ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, కె.రఘువీర్ రెడ్డి, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ఆర్.రఘురామిరెడ్డి, కడియం కావ్య కూడా ఉన్నారు.



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# జన్నారంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ప్రజా స్వేచ్ఛ
దేశంలోని పౌరులందరికీ కుల మత ప్రాంత పేద ధనిక భేదాలు లేకుండా సమాన న్యాయం కల్పించే హక్కును ప్రసాదించిన రాజ్యాంగంను ఆమోదించిన రోజు నేడు నవంబర్ 26 సందర్భంగా జన్నారం మండల కేంద్రంలో ఎస్సీ ఎస్టీ బిసి కులాల నాయకులందరూ పాల్గొని అంబేద్కర్ గారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కన్వీనర్ కోడూరి చంద్రయ్య గారు అంబేద్కర్ సంఘం నాయకుడు చిట్టి మల్ల భరత్ కుమార్ గారు మాజీ మండల ఉపాధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాసు మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షుడు కాసెట్టి లక్ష్మణ్ గారు గారు మాజీ ఎంపిటిసి రాగుల శంకర్ గారు మాజీ కోఆప్షన్ సభ్యుడు మున్వర్ అలీ ఖాన్ గారు రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు లెక్కల మల్లయ్య గారు, మామిడి ఇందయ్య గారు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ముజఫర్ అలీఖాన్ గారు, మాజీ ఎంపిటిసి రియాజుద్దీన్ గారు జన్నారం మాజీ ఉప సర్పంచ్ జంగం సురేష్ గారు గోలి చందు గారు బీసీ కేయుపిఎస్ నాయకులు కడార్ల నరసయ్య గారు పొనకల్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ బాలసాని శ్రీనివాస్ గౌడ్ గారు,ఆర్ టి సి సీనియర్ నాయకుడు గోపి సత్యనారాయణ గారు బిసి నాయకుడు మామిడి విజయ్ గారు నో ఋల రాజు గారు జన్నారం మండల మాజీ ఉపసర్పంచ్ అజహర్ గారు బీజేవైఎం నాయకుడు ములుగు ప్రవీణ్ గారు కొత్త శ్రీనివాస్ గారు పొనకల్ గ్రామ మాజీ వార్డు సభ్యుడు గంగన్న గారు తదితరులు పాల్గొన్నారు

**తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# జనవరి నుంచి సన్న బియ్యం

మంత్రి సీతక్క..!!



ప్రజా స్వేచ్ఛ
రాష్ట్రంలోకి పేదలందరికీ జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని, రానున్న కొద్దిరోజుల్లోనే రుణమాఫీ కాని రైతులకు మరో 10 వేల కోట్లను కేటాయిస్తామని మంత్రి సీతక్క అన్నారు. ఇవాళ ములుగు జిల్లాలో పలు అభివృ పనుల ప్రారంభం, శంకుస్థాపన కార్యక్రమా సీతక్క పాల్గొని మాట్లాడారు.. ఇచ్చిన ప్రతి హామీ అమలు చేసే తీరుతామన్నారు. మహిళ లను కోటీశ్వరులుగా చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టిన్నట్లుగా ఆమె తెలిపారు. ఇందు కోసం ప్రత్యేకంగా 19 రకాల వ్యాపారా లను ఎంపిక చేసిన్నట్లు వివరించారు. మరో మూడు గ్యారంటీలను త్వరలోనే అమలు చేస్తా మన్నారు. 'రానున్న రోజులలో రైతు భరోసా, మహిళలకు 2500 రూపాయల పింఛన్ పెంపు పథకాలను అమలు చేస్తాం. రూ. 18 వేల కోట్లను రైతు రుణమాఫీ పథకంలో పంపిణీ చేశామని, రానున్న రోజులలో మరో 10 వేల కోట్లు కేటాయిస్తాం. 150 బస్సులను మహిళా సంఘాలకు కేటాయించి ఆర్టీసీలో భాగస్వామ్యం చేశాం. మహిళలు తయారు చేసిన వస్తువులను సిటీలో శిల్పారామంలో అమ్ముకునే ఏర్పాటు చేస్తున్నం. రైతు భరోసా స్కీంలో రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తాం. ప్రభుత్వం చేసే అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు ఫేక్ ప్రచారాలు చేస్తున్నారు. ' అని సీతక్క అన్నారు. అనంతరం 75వ భారత రాజ్యాంగ దినోత్సవా న్ని పురస్కరించుకొని అధికారులు, గ్రామస్థుల తో మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధి హామీ పథకం లో భాగంగా వంద రోజులు పూర్తి చేసు కున్న లబ్ధిదారులకు, ఉత్తమ గ్రామపంచాయతీ సిబ్బందిని మంత్రి సత్కరించారు.




తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# బీసీ కులాల నాయకులారా!

ప్రజా స్వేచ్ఛ
నేడు గౌరవనీయులు కీ. శే. మహాత్మా జ్యోతిబాపూలే గారి వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించే కార్యక్రమం తెలుగు రాష్ట్రాల్లోని అన్ని గ్రామాల్లో పట్టణాల్లో మండలాలలో బీ సీ సంఘాల వారు కుల




సంఘాల వారు ఘనంగా నిర్వహించగలరు. సమైక్యత చాటగలరు. కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరు. బీ సీ కులాల వారు ఏకం కావాల్సిన సమయం వచ్చింది బీసీ కులాల ఉద్యమ పోరాట సంఘం తెలంగాణ రాష్ట్రం కన్వీనర్ తరిగొప్పుల మహేందర్ గారు రిటైర్డ్ న్యాయమూర్తి పేరం అలేఖ్య గారు హై కోర్టు న్యాయవాది మహిళా విభాగం. రాష్ట్ర కన్వీనర్ గారు
శ్రీ బాసర సరస్వతీ దేవరయే నమః

**-తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి ఒక ప్రకటనలో తెలియజేశారు.**

# హరిహరసుతుడు అయ్యప్ప సేవలో ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



కుత్బుల్లాపూర్ ప్రజా స్వేచ్ఛ
గాజులరామారం 125 డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు విజయ్ రాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ... అయ్యప్ప నామస్మరణతో చేపట్టే ప్రతీ పనిలో విజయం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం ఖాన్, నాయకులు మూసా ఖాన్, ఇమ్రాన్ బెగ్, వాహీద్, శాకీర్, మక్సూధ్ అలీ, శ్రవణ్, జునైధ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల కష్టం దళారుల పాలు

**-సన్న రకం ధాన్యం దళారుల పాలు**
**-విలవిలాడుతున్న అన్న దాతలు**
**-కనీస మద్దతు ధరకు నోచుకోని కష్టజీవులు**
**-వడ్ల కొనుగోలులో సిండికేట్ గా వ్యాపారులు**
**-మార్కెట్ ధరలకు పొంతన లేకుండా కొనుగోళ్లు**



చెన్నూర్, ప్రజా స్వేచ్ఛ
చెన్నూర్ మండల చుట్టుపక్కల గ్రామాలలో సన్న రకం ధాన్యం దళారుల పాలు అన్నదాతలకు దక్కాల్సిన లాభాలు దళారుల పాలవుతున్నాయి. సన్న రకం వడ్లు వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. దళారులు సిండికేట్‌గా మారి రైతులకు మద్దతు ధర దక్కకుండా నిలువు దోపిడీ చేస్తున్నారు. కిష్టంపేట, సుద్దాల, గంగారాం, అంగరాజ్ పల్లి, ఆస్నాద్, దుగ్నేపల్లి, పలు గ్రామాలలో సన్నరకం పంట దిగుబడి తక్కువగా ఉండటం, దొడ్డుబియ్యం తినేవారి సంఖ్య తగ్గిపోవడంతో బహిరంగ సన్నబియ్యం ధర ఏటేటా పెరుగుతూనే ఉంది. అన్నదాతలకు దక్కాల్సిన లాభాలు దళారుల పాలవుతున్నాయి. సన్నరకం వడ్లు వ్యాపారులకు కాసులు కురిపిస్తున్నాయి. మిల్లర్లు సిండికేట్‌గా మారి రైతులకు మద్దతు ధర దక్కకుండా నిలువు దోపిడీ చేస్తున్నారు. సన్నరకం పంట దిగుబడి తక్కువగా ఉండటం, దొడ్డుబియ్యం తినేవారి సంఖ్య తగ్గిపోవడంతో బహిరంగ సన్నబియ్యం ధర ఏటేటా పెరుగుతూనే ఉంది. కరెంట్ కష్టాలు, సాగునీటి ఇక్కట్లను దాటుకుని పండించిన పంటను విక్రయానికి తీసుకొచ్చే సరికి సన్న రకం వడ్లు దళారుల దోపిడీకి గురవుతున్నాయి. అన్నదాతలు శ్రమిస్తే వ్యాపారులు అప్పనంగా సొమ్ము చేసుకుంటున్నారు. కనీస మద్దతు ధర కొట్టి న్నట్టు చెప్తున్న కొంతమంది వ్యాపారులు సంచికి 3-5 కిలోల చొప్పున తరుగు తీస్తున్నారు. పంట కోతకు వచ్చిన సమయంలో ధరలు ఎలా ఉంటాయో తెలియక రైతులు పంట కోయకముందే దళారుల వద్ద నుండి కొంత సొమ్ము తీసుకుని దిగుబడి వచ్చిన మొత్తం పంటను దళారుల చేత పెడుతున్నారు. మార్కెట్లో సన్న ధాన్యం అధిక ధరలకు విక్రయించుకొని సొమ్ము చేసుకుంటున్నారు. దళారులు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పట్ల చొరవ చూపించి సన్న రకం వడ్లకు సరైన మద్దతు ధర కల్పించాలని దళారులు వారిని సహకరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలు రైతు సంఘాలు కోరుకుంటున్నారు.

## జిన్నింగ్ మిల్లు ఆకస్మిక తనిఖీ

**-అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి**



ప్రజా స్వేచ్ఛ ఖమ్మం :
కల్లూరు మండలం లో కొర్లగూడెం గ్రామంలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం,పేరువంచ గోకవరం గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను,తల్లాడలో జెన్నింగ్ మిల్లును అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు.ఈ సందర్భంగా సంబంధిత కొనుగోలు కేంద్రాల అధికారులతో మాట్లాడుతూ, రైతులకు ఇబ్బందులు ఏర్పడకుండా ఎప్పటికప్పుడు త్వరగా కొనుగోళ్లు పూర్తి చేసి,చెల్లింపులు కూడా వెనువెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు.ఈ సందర్భంగా మార్కెటింగ్,వ్యవసాయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మల యుగంధర్ ని కలిసిన కెసిఆర్ టవర్స్ డెవలప్మెంట్ కమిటీ నాయకులు

**పలు సమస్యలపై వినతి పత్రాలు**



ప్రజా స్వేచ్ఛ ఖమ్మం :
బుధవారం కేసిఆర్ టవర్స్ డెవలప్మెంట్ కమిటీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు.సిసి రోడ్,డ్రైనేజీ,సెంట్రల్ లైటింగ్,తాగు నీటి కోసం బోర్ ల ఏర్పాటుకు, రాత్రి పూట పోలీసులతో గస్తీ ఏర్పాటుకు,డబుల్ బెడ్ రూమ్ కాలనీకి ప్రత్యేకంగా చెత్త ట్రాక్టర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయండి జరిగింది.వెంటనే స్పందించిన యువ నాయకులు యుగంధర్ సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కెసిఆర్ టవర్స్ డెవలప్మెంట్ కమిటీ గౌరవ సలహాదారులు తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రడం సురేష్ గౌడ్,అధ్యక్షులు మహమ్మద్,ఆర్గనైజింగ్ సెక్రటరీ సాధిక్,మహిళా అధ్యక్షురాలు సమీరా,జాయింట్ సెక్రటరీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## సమాచార హక్కు చట్టంపై ప్రభుత్వం భరోసా కల్పించాలి

**బత్తుల మహేష్ గౌడ్**



హైదరాబాద్, ప్రజా స్వేచ్ఛ
సమాచార హక్కుచట్టంపై ప్రభుత్వం సామాన్య ప్రజలకు భరోసా కల్పించాలని బత్తుల మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు. సమాచార హక్కు చట్టం సాధన కమిటీ తెలంగాణ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ మేరకు బుధవారం హైదరాబాద్ లోని సమాచార హక్కు చట్టం సాధన కమిటి జాతీయ కార్యాలయంలో జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్.చంటి ముదిరాజ్ మరియు రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు సూర స్రవంతి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ కాల క్రమేణ ఆర్టీఐ యాక్ట్ చట్టం అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం సమాచారాన్ని వెల్లడించరు కారణం సక్రమంగా జరగాల్సిన పనులు అడ్డదారిలో జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత అధికార యంత్రాంగంలో జవాబుదారి తనంతో ప్రజలు కోరిన సమాచారాన్ని 30 రోజుల కాలంలో సమాచారం ఇవ్వాలని కోరారు. ఆయా శాఖల పౌరసమాచార అధికారులతో జిల్లా కేంద్రంగా కమిషన్ కోర్టును ఏర్పాటుచేసి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేవిధంగా కేసుల విచారణ ప్రక్రియ నిర్వహించి దరఖాస్తుదారుడు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లం వెంకటేశం, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి గుండెల రాయుడు, తెలంగాణ మహిళా కార్యనిర్వహక అధ్యక్షురాలు గంగా ప్రియ రెడ్డి,లక్ష్మి ప్రియ యాదగిరి గౌడ్,వి.దయాకర్ రెడ్డి,జి.కుమార్ యాదవ్, లగ్గొని శ్రీనివాస్ గౌడ్,నరేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వాలకు ప్రజల ఆకాంక్షలు నెరవేర్చితేనే మనుగడ

**-ఉస్మానియా యూనివర్సిటీ సోషల్ సైన్స్ మాజీ డీన్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె.శ్రీనివాసులు**
**-కేయూలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "జాతీయ సదస్సు"**






హన్మకొండ ప్రజా స్వేచ్ఛ
ప్రజల ఆకాంక్షలు నెరవేర్చితేనే ప్రభుత్వాలకు మనగడ ఉంటుందని,ప్రజలకిచ్చిన హామీలను అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అమలు చేసినప్పుడే సంక్షేమ అభివృద్ధి సాధ్యమని, తద్వారా మాత్రమే దేశంలో, రాష్ట్రంలో సుస్థిరపాలన నెలకొంటుందని ఉస్మానియా యూనివర్సిటీ సోషల్ సైన్స్ మాజీ డీన్ రిటైర్డ్ ప్రొఫెసర్ కె. శ్రీనివాసులు తెలిపారు.బుధవారం కాకతీయ విశ్వవిద్యాలయం సెనేట్ హాల్ లో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షలు, వాగ్దానాలు రాజకీయ పనితీరు" అనే అంశంపై "జాతీయ సదస్సు" రాజనీతి శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకటయ్య అధ్యక్షతన జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉస్మానియా యూనివర్సిటీ సోషల్ సైన్స్ మాజీ డీన్ రిటైర్డ్ ప్రొఫెసర్ కే శ్రీనివాసులు మాట్లాడుతూ అణగారిన ప్రజలను జీవితాంతం ఆర్థికంగా,ఆత్మ గౌరవంతో జీవించేలా చేసేవే నిజమైన సంక్షేమ పథకాలని, కులం,మతం,ఓట్లు,సీట్లు,రాజకీయ అధికార ప్రయోజనాలే ధ్యేయంగా ప్రభుత్వాలు పథకాలు తెస్తే పాలకులే సమాజాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టినట్టవుతుందన్నారు.గత ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రజాస్వామిక,ఉద్యమ ఆకాంక్షలు నెరవేర్చలేక పోయిందని,ప్రలోభ పూరిత వాగ్దానాలు, మాటలతో పాలన కొనసాగించడం వల్లనే అధికార పీఠం కోల్పోయిందన్నారు. 2014 నుండి 2023 వరకు తెలంగాణ విద్యారంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడిందని, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి, నాణ్యమైన పరిశోధనల కు సరిపడా నిధులు కేటాయించక పోవటం, ఖాళీగా ఉన్న అధ్యాపక ఖాళీలను భర్తీ చేయకపోవడంతో నేడు విశ్వవిద్యాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉస్మానియా యూనివర్సిటీ చరిత్ర విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ అడప సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతం ఎన్నో చారిత్రాత్మక సామాజిక, ప్రజా స్వామిక,సాంస్కృతికోద్యమాలకు పురిటి గడ్డ అని,ఈ మట్టిలో పుట్టిన ప్రతిబిడ్డ దిక్కారస్వరానికి, చైతన్యానికి ప్రతిక అని అన్నారు. నేటితరం విద్యార్థులు సామాజిక, ఆర్థిక,రాజకీయ రంగాల్లో వస్తున్న మార్పులను శాస్త్రీయ దృక్పథంతో అవగాహన చేసుకొని,ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.నేటికీ దేశంలో, రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు అధికారంలోకి రావడానికి కుల,మతాలను ఉపయోగించుకోవడం చాలా దురదృష్టకరమని అన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన వాగ్దానాలను విస్మరిస్తే ప్రజలే ప్రభుత్వాలను విస్మరిస్తారనే విషయాన్ని అధికార రాజకీయ పార్టీలు గ్రహించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ఏ. హరిప్రసాద్,ప్రొఫెసర్ టి. మనోహర్,ప్రొఫెసర్ ఆర్. మల్లికార్జున రెడ్డి,ప్రొఫెసర్ వి. రామచంద్రం లు ప్రసంగించారు. అనంతరం విద్యార్థులకు,ప్యానల్స్ స్పీకర్లకు మధ్య ప్రశ్నలతో కూడిన సమాధానాల చర్చ కొనసాగింది.రాజనీతి శాస్త్ర విభాగం అధ్యాపకులు,బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, డాక్టర్ వి.సత్యనారాయణ,డాక్టర్ వి.నాగరాజు,డాక్టర్ లలిత కుమారి,డాక్టర్ విజయ్, డాక్టర్ లక్ష్మీ నారాయణ,డాక్టర్ టి సంజీవ్ లతో పాటు రీసెర్చ్ స్కాలర్స్,విద్యార్థులు పాల్గొన్నారు.

# అధికారులు బీ అలర్ట్

**-విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదు**
**-కొత్తగూడెం జిల్లా అధికారులకు మంత్రి పొంగులేటి స్వీట్ వార్నింగ్**





ప్రజా స్వేచ్ఛ
తెలంగాణ రెవెన్యూ,గృహనిర్మాణం,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కొత్తగూడెం జిల్లా అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగూడెం జిల్లా పర్యటనకు బుధవారం వచ్చి అప్పటికప్పుడు పలు శాఖల అధికారులతో చుంచుపల్లిలోని మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై వేటు తప్పదని స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందడంలో, అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలుంటాయన్నారు.పలు శాఖల అధికారులపై ఫిర్యాదులొస్తున్నాయని,అవి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... సీఎస్ఆర్ ద్వారా వచ్చే నిధులు నిర్వీర్యం అవుతున్నట్లు తన దృష్టికి వచ్చింద వాటిని మంచి పనులకు వినియోగించాలని లేకపోతే శాఖపరమైన చర్యలుంటాయని సీపీవోను హెచ్చరించారు.ఆయా ప్రాంతాల్లో జరిగే రోడ్డు అభివృద్ధి పనులకు అటవీ శాఖ నుంచి అవసరమైన అనుమతులను అలస్యం లేకుండా పొంది పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఈఈలకు సూచించారు.గ్రామాల్లో పనిచేసే పంచాయతీ సెక్రటరీలు నివాసం ఓ చోట విధులు మరో చోట నిర్వహిస్తుండటంతో ఆయా గ్రామాల్లో వారికి పట్టు ఉండటం లేదని వెంటనే ఆయా గ్రామాల సెక్రటరీలు వారు పనిచేస్తున్న గ్రామాలకు నివాసం మారాలని సూచించారు. వారిపై డీపీవో పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు.గ్రామాల్లో వీధిలైట్లు, మంచినీరు ఇతరత్రా సమస్యలేవీ లేకుండా చూడాలన్నారు.అలాగే జిల్లాలోని పలు మండలాల్లో ఎమ్మార్వోలపై వరుస ఫిర్యాదులందుతున్నాయని తెలిపారు.ఎమ్మార్వోలను పర్యవేక్షించే బాధ్యత ఆర్ డీ వో లదేనని సూచించారు. వారి పనితీరు ఎప్పటికప్పుడు తనకు అప్ డేట్ చేస్తూ ఉండాలని సూచించారు. వాటి ఆధారంగా వారిపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో జరిగే అభివృద్ధి పనుల్లో మెరుగైన పనితీరు కోసం ఒక్కరికే రూ.50లక్షల ఆ పై టెండర్లు ఇవ్వాలన్నారు. తద్వారా అతని పై ఒత్తిడి పెంచి పనిని త్వరగా పూర్తి చేయించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఆర్ డ బ్ల్యూఎస్ అధికారులు వారి విధులను సక్రమంగా నిర్వర్తించాలని,ఆకస్మిక తనిఖీ చేస్తానని నిర్లక్ష్యం వహిస్తున్నట్లు గమనిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.వరిపాలన సజావుగా సాగేందుకు లోకల్ బాడీస్ జిల్లా అడిషనల్ కలెక్టర్ అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకోని విధులు నిర్వర్తించాలన్నారు.

# బిజినెస్

## హెూండా నుంచి సరికొత్తగా యాక్టివా ఈవీ

**-ఫీచర్లు చూస్తే అదిరిపోవాల్సిందే!**



ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయాలని అనుకునే వారికి గుడ్‌న్యూస్. ప్రముఖ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ హెూండా మోటార్స్ ఇప్పుడు సరికొత్తగా ఎలక్ట్రిక్ వాహనాలను తీసుకొస్తోంది. హెూండా యాక్టివా ఈ, క్యూసీ 1 పేరిట రెండు ఎలక్ట్రిక్ స్కూటర్‌లను విపణిలోకి తీసుకొస్తోంది. ఈ నేపథ్యంలో ఆ రెండు ఈవీ స్కూటర్లను ఇవాళ ప్రదర్శించారు. హెూండా యాక్టివా ఈవీ.. రెగ్యులర్ యాక్టివా మోడల్ కంటే కొంచెం భిన్నంగా ఉంది. ఎల్‌ఈడీ హెడ్ ల్యాంప్‌తో పాటు సైడ్ ఇండికేటర్ల విషయంలో స్వల్ప మార్పులు చేశారు. ఇది స్వాపబుల్ బ్యాటరీతో వస్తుంది. ఇందులో రెండు 1.5 కిలోవాట అవర్ బ్యాటరీలను అమర్చారు. ఈ స్కూటర్ సింగిల్ ఛార్జ్‌తో 102 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. గరిష్టంగా గంటకు 80 మీటర్ల వేగంతో వెళ్లవచ్చు. స్టాండర్డ్, స్పోర్ట్స్, ఎకానమీ మోడ్‌లలో హెూండా యాక్టివా ఈవీ అందుబాటులోకి రానుంది. హెూండా క్యూసీ 1ను తక్కువ దూరం ప్రయాణించే వారిని దృష్టిలో పెట్టుకుని డిజైన్ చేశారు. ఇది 1.5 కిలోవాట్ అవర్ బ్యాటరీ ప్యాక్‌తో వస్తుంది. సింగిల్ చార్జ్‌తో 80కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చు. గరిష్టంగా గంటకు 50 కిలోమీటర్ల వేగంతో వెళ్లవచ్చు. ఈ రెండు ఈవీ స్కూటర్లకు సంబంధించిన ధరలు మాత్రం ఇంకా ప్రకటించలేదు. కాకపోతే వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి వీటి బుకింగ్స్‌ను ప్రారంభించనున్నారు. అప్పుడే ధరల వివరాలు వెల్లడించే అవకాశం ఉంది

## అదానీకి రేటింగ్స్ దెబ్బ

**-అమెరికా కేసు నేపథ్యంలో ఏడు సంస్థలకు మూడీస్ నెగెటివ్ ఔట్‌లుక్**

**-పలు అదానీ బాండ్లను ప్రతికూలంలో పెట్టిన ఫిచ్**



అమెరికా లంచం కేసులో గౌతమ్ అదానీ ఇరుక్కోవడం.. అదానీ గ్రూప్‌నకు రకరకాల సమస్యల్ని తెచ్చిపెడుతున్నది. ఇప్పటికే ఆయా కంపెనీల షేర్ల విలువ దేశీయ స్టాక్ మార్కెట్‌లో పడిపోతుండగా, విదేశీ మదుపరులు పెట్టుబడులకు దూరం జరుగుతున్నారు. తాజాగా ప్రముఖ గ్లోబల్ రేటింగ్ ఏజెన్సీలైన మూడీస్, ఫిచ్‌ల సెగ కూడా అదానీకి తగిలింది. అదానీ గ్రూప్‌లోని ఏడు సంస్థల రేటింగ్ ఔట్‌లుక్‌ను 'స్టేబుల్' నుంచి 'నెగెటివ్'లోకి దిగజార్చినట్టు మంగళవారం మూడీస్ ప్రకటించింది. వీటిలో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్ లిమిటెడ్, రెండు అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ విభాగాలు, అదానీ ట్రాన్స్‌మిషన్ స్టెప్ వన్ లిమిటెడ్, అదానీ ట్రాన్స్‌పోర్టేషన్ రెస్ట్రిక్టెడ్ గ్రూప్ 1, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్, అదానీ ఇంటర్నేషనల్ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలున్నాయి. మరోవైపు అదానీ ఎనర్జీ, అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై బాండ్లను నెగెటివ్ మోడ్‌లో పెట్టినట్టు ఫిచ్ రేటింగ్స్ స్పష్టం చేసింది. దీంతో ఆయా సంస్థల్లోకి పెట్టుబడులు, బాండ్ల క్రయవిక్రయాలు రిస్క్‌లో పడ్డట్టెంది.

**టోటల్‌ఎనర్జీస్‌పై..**

ఫ్రాన్స్‌కు చెందిన ఇంధన దిగ్గజం టోటల్‌ఎనర్జీస్.. అదానీ గ్రూప్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టబోమంటూ చేసిన ప్రకటనపై గ్రూప్ సంస్థ స్పందించింది. మా కార్యకలాపాలపై ఈ నిర్ణయం ఏ రకమైన ప్రభావం చూపబోదంటూ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ పేర్కొన్నది.

## భారీగా తగ్గిన బంగారం ధర.. తులం ఎంతంటే



బంగారం ధరలు మళ్లీ తగ్గుముఖం పడుతున్నాయి. ఆ మధ్య ఆల్‌టైమ్ హై రికార్డులతో హెూరెత్తించినా.. ఆ తర్వాత వరుసగా క్షీణించాయి. కానీ తిరిగి పరుగులు పెట్టిన గోల్డ్ రేట్లు.. ఇప్పుడు పతనం దిశగా సాగుతున్నాయి. వరుసగా మూడు రోజుల నుంచి బంగారం ధరలు భారీగా తగ్గుముఖం పడుతున్నాయి. 24 క్యారెట్ల బంగారంపై సుమారు రూ. 2410 మేరకు తగ్గింది. నిన్నటితో పోలిస్తే 10 గ్రాముల బంగారం ధర కూడా స్వల్పంగా తగ్గింది. అటు వెండి ధరలు కూడా గత మూడు రోజుల్లో రూ. 2600 మేరకు తగ్గాయి. హైదరాబాద్‌లో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 77వేల 230 రూపాయలు పలుకుతోంది. అలాగే, 22 క్యారెట్ల గోల్డ్ రేట్ 70వేల 790గా ఉంది. ఇక, వెండి ధర కూడా తగ్గి.. ప్రస్తుతం కిలో వెండి 97వేల 900 దగ్గర ట్రేడ్ అవుతోంది. ఇక దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఎలా ఉన్నాయంటే.. ఢిల్లీలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 77,380గా ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ. 70,940గా ఉంది. అటు ముంబై, కోల్‌కతా, బెంగళూరు, చెన్నైలో పది గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ. 77,230గా ఉండగా.. 22 క్యారెట్ల గోల్డ్ రేట్ రూ. 70,790గా కొనసాగుతోంది. కాగా, ఈ ధరలు బుధవారం ఉదయం ఆరు గంటలకు నమోదైనవిగా గమనించగలరు. బంగారం కోనుగోలు చేసే ముందు ఒకసారి ధరలు చెక్ చేసుకోవడం బెటర్.


## బెంగళూరును వీడిన మహ్మద్ సిరాజ్.. భావోద్వేగానికి గురైన హైదరాబాదీ బౌలర్..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ మెగా వేలం సోమవారంతో ముగిసింది. చాలా వరకు జట్లు కొత్త వారిని తీసుకునేందుకు ఆసక్తి చూపించాయి. ఈ క్రమంలో పాత వారిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించలేదు. హైదరాబాదీ స్టార్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌ను రాయల్ చాలెంజర్స్ బెంగళూరు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపించలేదు. రైట్ టు మ్యాచ్ ని సైతం ఉపయోగించుకునేందుకు ఇంట్రెస్ట్ చూపించలేదు. ఈ దాంతో ఏడేళ్ల అనంతరం మహ్మద్ సిరాజ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును వీడాల్సి వచ్చింది. ఈ క్రమంలో మహ్మద్ సిరాజ్ భావోద్వేగానికి గురయ్యాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా పోస్ట్‌ని పెట్టాడు. ఈ సందర్భంగా తన మనసులోని భావాలను వ్యక్తం చేశాడు. ఆర్‌సీబీ తన హృదయానికి దగ్గరైందని.. ఈ ప్రయాణం ఓ అసాధారణ అనుభవం కంటే తక్కువ కాదని పేర్కొన్నాడు. తాను తొలిసారిగా ఆర్‌సీబీ జెర్సీని ధరించిన రోజు.. తాము ఇంత దగ్గరవుతామని ఎప్పుడూ అనుకోలేదని.. ఆర్సీబీ జెర్సీ ధరించి వేసిన మొదటి బంతి, తీసిన ప్రతి వికెట్, ఆడిన ప్రతి మ్యాచ్, మీతో గడిపిన ప్రతిక్షణం, ఈ ప్రయాణం అసాధారణ అనుభవం కంటే తక్కువ కాదు.. ఇందులో హెచ్చుతగ్గులున్నాయి కానీ.. ఒక విషయం స్థిరంగా ఉందని.. అది తిరుగులేని మద్దతు అంటూ స్పందించాడు. ఐపీఎల్ మెగా వేలానికి ముందు సిరాజ్‌ను ఆర్‌సీబీ రిలీజ్ చేసింది. ఆర్‌సీబీ కేవలం ముగ్గురు ఆటగాళ్లనే రిటైన్ చేసుకొని.. మిగతా వారందరినీ రిలీజ్ చేసింది. ఇందులో విరాట్ కోహ్లీని రూ. 21కోట్లకు, రజత్ పటీదార్ రూ. 11కోట్లు, యశ్ దయాల్ రూ. 4కోట్లకు అట్టిపెట్టుకున్నది. సిరాజ్ రూ. 2కోట్ల బేస్ ప్రైస్‌తో వేలానికి రాగా.. గుజరాత్ టైటాన్స్ రూ. 12.25కోట్ల కొనుగోలు చేసింది. ఆర్‌సీబీ తరఫున సిరాజ్ 87 మ్యాచులు ఆడి.. 83 వికెట్లు తీశాడు. మొదట సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఐపీఎల్ కెరీర్‌ను ప్రారంభించిన సిరాజ్.. 2018లో ఆర్‌సీబీ తరఫున ఎంట్రీ ఇచ్చాడు. గత సీజన్‌లో 14 మ్యాచుల్లో 15 వికెట్లు పడగొట్టాడు.

# స్పోర్ట్స్

## టెస్టు ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా నెంబర్ వన్



టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐసీసీ మెన్స్ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో 8 కీలక వికెట్లు తీసిన బుమ్రా, ఈ విజయంతో టీమిండియాకు 295 రన్స్ భారీ తేడాతో గెలుపు అందించారు. ఈ ప్రదర్శనతో బుమ్రా, కగిసో రబాడ, జోష్ హేజిల్‌వుడ్‌లను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని సాదించాడు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యశస్వి జైస్వాల్ రెండో స్థానానికి ఎగబాకారు. పెర్త్ మ్యాచ్‌లో 161 రన్స్ చేసి 825 పాయింట్లతో కెరీర్ బెస్ట్ సాధించారు. అయితే జో రూట్ కంటే 78 పాయింట్ల తేడాతో వెనుకంజలో ఉన్నారు. మరోవైపు 89 రన్స్ చేసిన ట్రావిస్ హెడ్ టాప్ 10లోకి చేరి 10వ స్థానంలో నిలిచారు. విరాట్ కోహ్లీ తన 30వ టెస్ట్ సెంచరీతో 13వ స్థానానికి ఎగబాకిన విషయం తెలిసిందే. టెస్ట్ ఆల్‌రౌండర్స్ జాబితాలో రవీంద్ర జడేజా, ఆర్. అశ్విన్ వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఆసీస్‌తో తొలి టెస్ట్ ఆడకపోయినప్పటికీ, ఈ జాబితాలో వారు ర్యాంకులను నిలబెట్టుకున్నారు. ఇక టెస్ట్ బౌలర్స్ ర్యాంకింగ్స్‌లో మొహమ్మద్ సిరాజ్ 25వ స్థానంలో ఉన్నారు. ఈ ర్యాంకింగ్స్ భారత్ క్రికెటర్ల అద్భుత ప్రదర్శనకు ప్రతిఫలంగా నిలిచాయి. బుమ్రా, జైస్వాల్, కోహ్లీ, జడేజా, అశ్విన్ అందరూ తమ ర్యాంకులను మెరుగుపరుచుకోవడంతో, భారత జట్టు టెస్టుల్లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది.

## 28 బంతుల్లో సెంచరీ.. ఉర్విల్ పటేల్ రికార్డు



గుజరాత్ వికెట్ కీపర్ ఉర్విల్ పటేల్ టీ20ల్లో కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో అతి వేగంగా సెంచరీ కొట్టాడు. త్రిపురతో జరిగిన మ్యాచ్‌లో అతను కేవలం 28 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. ఏ-లిస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా సెంచరీ కొట్టిన ప్లేయర్‌గా రికార్డు నెలకొల్పాడు. టీ20ల్లో అత్యంత వేగంగా సెంచరీ చేసిన భారత క్రికెటర్లలో రెండవ వ్యక్తిగా నిలిచాడు. గతంలో రిషబ్ పంత్ దేశవాళీ టీ20 క్రికెట్‌లో ఫాస్ట్‌గా సెంచరీ చేశాడు. 2018లో సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను సెంచరీ సాధించాడు.

ఇప్పటి వరకు టీ20 క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ 27 బంతుల్లో నమోదు అయ్యింది. ఇస్టోనియాకు చెందిన సాహిల్ చౌహాన్.. 27 బంతుల్లో సైప్రస్‌పై స్కోర్ చేశాడు. ఉర్విల్ పటేల్ తన ఇన్నింగ్స్‌లో నాలుగు ఫోర్లు, 12 సిక్సర్లు కొట్టాడు. 35 బంతుల్లో 113 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. కేవలం 10.2 బంతుల్లోనే గుజరాత్ చేజింగ్‌ను పూర్తి చేసింది. రెండు రోజుల క్రితం జరిగిన ఐపీఎల్ వేలంలో ఉర్విల్ పటేల్‌ను ఎవరూ కొనుగోలు చేయలేదు. గత ఏడాది కూడా ఉర్విల్ ఓ సెంచరీ చేశాడు. విజయ్ హజారే ట్రోఫీ లో భాగంగా అరుణాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను కేవలం 41 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు.



# నా కేరీర్‌లో ఎక్కువ కష్టపడింది వర్షం సినిమాకే : త్రిష

తమిళ బ్యూటీ త్రిష కృష్ణన్ వర్షం సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన ఈ చిత్రం 2004లో వచ్చి మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా త్రిషకు ఉత్తమ నటిగా ఫిలిం ఫేర్ అవార్డు తెచ్చిపెట్టింది. అయితే తన కెరీర్‌లో ఇప్పటివరకు అత్యంత కష్టపడిన సినిమా అంటే వర్షం సినిమానే అని చెప్పుకోచ్చింది ఈ భామ. రీసెంట్‌గా ఒక తమిళ అవార్డుల వేడుకలో పాల్గోన్న త్రిష కృష్ణన్ తన అమ్మ ఉమ కృష్ణన్‌తో హాజరైంది. అయితే అవార్డు తీసుకోవడానికి వేదికపైకి త్రిష వెళ్లగా.. యాంకర్ త్రిష అమ్మను అడుగుతూ.. త్రిష కృష్ణన్ తన కెరీర్‌లో ఏ సినిమాకు అత్యంత కష్టపడిందని అడుగుతుంది. దీనికి ఉమ కృష్ణన్ మాట్లాడుతూ.. త్రిష కెరీర్‌లో చాలా కష్టపడిన చిత్రం వర్షం. ఈ సినిమా కోసం 45 రోజులు వర్షంలోనే గడిపాం. ఇదంత చూసి ఈ సినిమా మానేసి చెన్నైకి వెళదాం అనుకున్నాం. కానీ ధైర్యంతో ముందుకు నడిచాం. ఈ సినిమా విడుదలయ్యాక మా కష్టం అంతా మర్చిపోయం. సినిమా చాలా పెద్ద హిట్ అయ్యింది. అని చెప్పగానే.. త్రిష కూడా అవును వర్షం సినిమాకే నేను చాలా కష్టపడ్డాను అంటూ చెప్పుకోచ్చింది. వర్షం సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది త్రిష. తెలుగులో నువ్వొస్తానంటే నేనొద్దంటానా, అతడు, పౌర్ణమి, స్టాలిన్, సైనికుడు, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, కృష్ణ, బుజ్జిగాడు వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో కలిసి విశ్వంభర అనే పాన్ ఇండియన్ సినిమాలో నటిస్తుంది.



## కాబోయే భర్తను పరిచయం చేసిన కీర్తి సురేష్

దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరైన కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. తన చిరకాల మిత్రుడు ఆంటోనీ తట్టిల్‌తో ఏడడుగులు వేయబోతున్నారంటూ తమిళ మీడియాతో పాటు ఇటు తెలుగులో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో కీర్తి తాజాగా కీలక ప్రకటన చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నిజం చేస్తూ.. తన బాయ్‌ఫ్రెండ్‌ను కీర్తి సురేశ్ తాజాగా పరిచయం చేశారు. ఆంటోని తట్టిల్‌తో 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ఇద్దరూ సూర్యుడివైపు చూస్తున్న ఓ అందమైన ఫొటోను పంచుకున్నారు. ట్వీట్‌కు లవ్ సింబల్‌తో అని క్యాప్షన్ పెట్టారు. ఈ ట్వీట్ చూసిన అభిమానులు, నెటిజన్లు కీర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఆంటోనీ దుబాయ్‌కి చెందిన వ్యాపారవేత్త అని తెలిసింది. వీరిద్దరూ కలిసి ఒకే పాఠశాలలనే చదివినట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ హైస్కూల్ ప్రేమికులు ఇప్పుడు వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. కాగా, డిసెంబర్ రెండో వారంలో డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుందని సమాచారం. డిసెంబర్ 11, 12 తేదీల్లో గోవాలో గ్రాండ్ వెడ్డింగ్ జరగబోతోందంట. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరుకానున్నట్లు తెలిసింది. అయితే, తమ మధ్య ఉన్న రిలేషన్ షిప్ గురించి ఓపెన్ అయిన కీర్తి సురేశ్.. పెళ్లి గురించి మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.




# సైలెంట్‌గా ఓటీటీలోకి వచ్చిన నిఖిల్ అప్పుడో ఇప్పుడో ఎప్పుడో'

యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' . సప్త సాగరాలు దాటి సినిమాతో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఈ సినిమాలో కథానాయికగా నటించగా.. ఈ సినిమాకు స్వామిరారా దర్శకుడు సుధీర్ వర్మ దర్శకత్వం వహించాడు. ఛత్రపతి, డార్లింగ్ లాంటి బ్లాక్ బస్టర్ అందుకున్న టాలీవుడ్ టాప్ బ్యానర్ శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ప్రోడక్షన్స్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించాడు. ఈ చిత్రం నవంబర్ 08న ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. రావడం రావడమే మిక్సడ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘోర పరాజయాన్ని అందుకుంది. ఇప్పుడు ఈ చిత్రం ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్ వీడియో లో ఈ సినిమా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. చిన్నప్పటి నుంచి కార్ రేసర్ అవ్వలన్నది రిషి (నిఖిల్) కల. అయితే అనుకోకుండా తార (రుక్మిణి వసంత్) అనే అమ్మాయితో ప్రేమలో పడతాడు. కానీ కొన్ని కారణల వలన వీరిద్దరికి బ్రేకప్ అవుతుంది. బ్రేకప్ అనంతరం రేసర్ అవ్వాలనే లక్ష్యంతో లండన్ వెళ్లి అక్కడ పార్ట్ టైం పనులు చేస్తుంటాడు. అయితే ఈ క్రమంలోనే అక్కడ తులసి (దివ్యాంశ కౌశిక్) అనే అమ్మాయితో పరిచయం ఏర్పడి మళ్లీ ప్రేమలో పడతాడు. పెళ్లి చేసుకుందాం అనుకుంటాడు. అయితే ఇంతలోనే తులసి మయం అవ్వుతుంది. అయితే తులసి మయం ఎలా అవుతుంది. తులసిని పట్టుకోవడానికి రిషి ఏం చేస్తాడు. బ్రేకప్ చెప్పిన తార మళ్లీ లండన్‌లో రిషి కంట ఎందుకు పడుతుంది అనేది తెలియాలంటే ఈ సినిమా చూడాల్సిందే.



# అక్కినేని చిన్నకోడలు బ్యాక్ గ్రౌండ్ మీకు తెలుసా..?

యువ హీరో అక్కినేని అఖిల్ త్వరలో ఓ ఇంటివాడు కాబోతున్నాడు. ఆయన నిశ్చితార్థం జైనబ్ రవ్జీతో జరిగింది. ఈ విషయాన్ని అఖిల్ తండ్రి, అగ్ర నటుడు నాగార్జున మంగళవారం తన సోషల్‌మీడియా ఖాతా ద్వారా అధికారికంగా ప్రకటించారు. అయితే, ప్రస్తుతం అక్కినేని ఇంటికి కాబోయే కోడలు జైనబ్ గురించి తీవ్రంగా చర్చ నడుస్తోంది. ఆమె ఎవరు..? బ్యాగ్రౌండ్ ఏంటి..? అంటూ నెటిజన్లు, అక్కినేని అభిమానునలు తెగ సెర్చ్ చేసేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమె గురించి ఆసక్తికర విషయాలు మీకోసం.. సోషల్ మీడియా కథనాలు, టాలీవుడ్ సర్కిల్ నుంచి అందిన సమాచారం ప్రకారం.. 27 ఏళ్ల జైనబ్‌కు చాలా పెద్ద బ్యాగ్రౌండే ఉన్నట్లు తెలిసింది. హైదరాబాద్‌లో పుట్టిన జైనబ్ రవ్జీ ముంబైలో స్థిరపడినట్లు సమాచారం. ఆమెకు చిత్రకారిణి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా మంచి పేరుంది. మన దేశంలోనే కాకుండా దుబాయ్, లండన్‌లోనూ ప్రదర్శనలిచ్చినట్లు తెలిసింది. అంతేకాదు.. ఎంఎఫ్ హుస్సేన్ దర్శకత్వంలో 'మీనాక్షి: ఎ టేల్ ఆఫ్ థ్రీ సిటీస్' సినిమాలో కూడా జైనబ్ రవ్జీ యాక్ట్ చేశారు. ఆ సినిమాలో సీనియర్ హీరోయిన్ టబు, కునాల్ కపూర్ నటించారు. పెయింటర్‌గా మంచి పేరున్నా.. జైనబ్ రవ్జీ చాలా లో-ప్రొఫైల్ మెయిన్‌టెయిన్ చేస్తుంటారు. ఇక ఆమె తండ్రి జుల్ఫీ రవ్జీ రియల్ ఎస్టేట్ టైకూన్. ఈ రంగంలో ఆయనకు 30 ఏళ్ల అనుభవం ఉంది. అంతేకాదు ఆయన ఆంధ్రప్రదేశ్‌లో గత ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ముఖ్య సలహాదారునిగా పనిచేశారు. మిడిల్ ఈస్ట్ దేశాలకు ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా సేవలు అందించారు. అఖిల్‌తో జైనబ్ ఎంగేజ్మెంట్ వేళ.. జుల్ఫీ రవ్జీని నవంబర్ 13, 2019న ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమిస్తూ జగన్ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఇప్పుడు వైరల్‌గా మారింది. జుల్ఫీ రైవ్జీ కుటుంబానికి వేల కోట్ల ఆస్తులున్నాయి.

Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492